




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 295 | ది. 4-2-2026 | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 295 | Date : 4-2-2026 | Wednesday | Pages : 8 | Rs.1/- |


# అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా ఏపీ

- వచ్చే ఐదేళ్లలో 50 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం
- త్వరలోనే రాష్ట్రమంతటా శిక్షణా తరగతులు
- ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ ఏర్పాటు
- లంబసింగిలో కుంకుమ పువ్వు సాగుకు ప్రణాళికలు
- వ్యవసాయం, అనుబంధ శాఖలపై సమీక్షలో సీఎం చంద్రబాబు



**అమరావతి,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** ఏపీని అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా మార్చే కార్యక్రమానికి త్వరలో శ్రీకారం చుట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధికారులకు సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18 లక్షల మంది రైతులు.. 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చారని అన్నారు. దీనిని సమర్ధవంతగా అమలు చేస్తూ... 2030-31 నాటికి 40 లక్షల మంది రైతులు, 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సాగు చేపట్టేలా చూడాలని స్పష్టం చేశారు. వ్యవసాయం, అనుబంధ శాఖలపై అధికారులతో సచివాలయంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి రసాయన ఎరువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, దీంతో రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గి, పంట ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందన్నారు. ప్రకృతి సాగు ఉత్పత్తుల నాణ్యత తెలిసేలా సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సదుపాయం కల్పించాలన్నారు. అలాగే వ్యవసాయ విద్యార్థులు ప్రకృతి సాగు చేయడం ద్వారా దాని వల్ల వచ్చే ఫలితాలను స్వయంగా తెలుసుకునేలా చేయాలన్నారు. ప్రకృతి సాగుకు సంబంధించి ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ వంటివి ఈ ఏడాది ఏప్రిల్ కల్లా వచ్చేలా చూడాలని ఆదేశించారు. అలాగే జూన్ నాటికి రాష్ట్రమంతటా పూర్తి కావాలని ముఖ్యమంత్రి సూచించారు. సుభాష్ పాలేకర్‌తో రాష్ట్రమంతటా ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామని సీఎం చెప్పారు. అంతర్జాతీయ, జాతీయ మార్కెట్లో ఏపీ వ్యవసాయ ఉత్పత్తుల వాటా అధికంగా ఉండేలా చూడాలన్నారు.

**ఎల్‌నీనో ఎదుర్కొనేలా ప్రణాళికలు..** రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం కారణంగా రైతులు నష్టపోకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని... వర్షాభావ పరిస్థితులు నెలకొనే ప్రాంతాల్లో సంప్రదాయ పంటల స్థానంలో ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఏఐ ఆధారిత క్రాప్ అడ్వయిజరీ 'భారత్ విస్తార్' వంటి వాటిని రాష్ట్రంలోనూ వినియోగించుకోవాలన్నారు. రాయలసీమలో ఒకప్పుడు నీటి సమస్య ఉండేది... సమర్ధ నీటి నిర్వహణతో ఈ ఏడాది ఆ సమస్యను తీర్చాం... అన్ని రిజర్వాయర్లు నింపడంతో సాగునీటికి లోటు లేకుండా చేశామన్నారు. యూఎస్, ఈయూతో ట్రేడ్ ఒప్పందం నేపథ్యంలో రాష్ట్రం నుంచి రొయ్యలు, ఎండు మిర్చి, మామిడి, వరి, ప్రాసెస్డ్ ఫుడ్ ఎగుమతులు పెంచుకునేందుకు మరింత అవకాశం కలిగిందని అధికారులు వివరించగా..., అయితే నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చూడాలని సీఎం అన్నారు.

**ఇకపై ఆక్వా సాగు నమోదు తప్పనిసరి..** ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. కల్టివేషన్, ప్రాసెసింగ్, మార్కెటింగ్... ఇలా అన్ని అంశాలు అంతర్జాతీయ స్థాయిలో కోకో సిటీలో ఉండాలన్నారు. మామిడి, కోకో, జీడిమామిడి, కొబ్బరి తోటల్లో అంతర్ పంటల సాగుకు అవకాశాలు ఉన్నాయని... రైతుల్ని ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. అరటి ఉత్పత్తిలో దేశంలోనే రెండో స్థానంలో ఉన్నప్పటికీ... ఎగుమతుల విషయంలో వెనకబడ్డామని, ఎగుమతులపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే, స్థానిక గిరిజనుల భాగస్వామ్యంతో పీపీపీ విధానంలో లంబసింగిలో పెద్దఎత్తున కుంకుమపువ్వు సాగుకు ముందుకొచ్చే సంస్థలకు అనుమతి ఇవ్వాలన్నారు. ఆక్వా సాగు వివరాలను రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. పౌల్ట్రీ రంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీలకు కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్ట్‌ను రైతులకే ఇవ్వాలని సీఎం నిర్దేశించారు. వ్యవసాయం, అనుబంధం రంగాలకు సంబంధించి కేంద్ర పాలసీలకు అనుగుణంగా రాష్ట్ర పాలసీలు ఉండాలని చెప్పారు.

**పంటల ప్రాముఖ్యత తెలిసేలా ఫెస్టివల్స్..** కుప్పంలో ఫ్లవర్ ఫెస్టివల్ నిర్వహించినట్టే మన పంటలకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో పలు ఫెస్టివల్స్ నిర్వహణకు ఆలోచన చేయాలని, దీంతో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. లాజిస్టిక్ ఖర్చులు తగ్గించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ విస్తృతం అవుతుందన్నారు. అవసరమైతే కేంద్రంతో మాట్లాడి మన వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ప్రత్యేక రైల్ బోగీలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. హార్టికల్చర్, ఆక్వాకు ఏపీ గమ్యస్థానంగా ఉందని... ఈ పంట, శాటిలైట్ సమాచారం ద్వారా దిగుబడి అంచనా వేసి, అందుకు అనుగుణంగా మార్కెటింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. ఫ్రూట్ కవర్లతో మామిడికి మంచి నాణ్యత-ధర వచ్చిందని, జామ, దానిమ్మ వంటి పండ్ల తోటలకు ఈ విధానాన్ని అనుసరించేలా చూడాలని సీఎం చెప్పారు. ఫుడ్ క్లస్టర్ల వారీగా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు ఎంవోయూ కుదుర్చుకున్న సంస్థలు త్వరితగతిన నెలకొల్పేలా సంప్రదింపులు జరపాలన్నారు. త్వరలో మామిడి ప్రాసెసింగ్ యజమానులతో సమావేశం నిర్వహించి, వారి సమస్యలు పరిష్కరిద్దామని సీఎం చెప్పారు.

**పీపీపీ విధానంలో ఫ్లవర్ మార్కెట్..** మార్కెట్ యార్డులు ఉన్నచోట రైతు బజార్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట రైతు బజార్లను ఆధునీకరించాలన్నారు. విజయవాడలో పీపీపీ విధానంలో ఫ్లవర్ మార్కెట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. సమీక్షలో డిజి రైతు బజార్ యాప్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా కూరగాయలను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసుకునే అవకాశం కలుగుతుంది. అలాగే ఫార్మ్ మిషనరీ కోసం ఏపీఏఐఎంఎస్ యాప్‌ను, కిసాన్ డ్రోన్ యాప్‌ను ప్రారంభించారు. రైతులు తమకు అవసరమైన ట్రాక్టర్లు, డ్రోన్లు, గడ్డికోత మిషన్లు, పవర్ టిల్లర్లు, బేలర్లను బుక్ చేసుకుని సేవలు పొందవచ్చు.

# లోక్‌సభలో 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్



**ఢిల్లీ,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** లోక్‌సభలో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను స్పీకర్ సస్పెండ్ చేశారు. బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యేంత వరకు సస్పెన్షన్ చేశారు. సస్పెండ్ అయిన వారిలో కాంగ్రెస్ ఎంపీలు మాణికం ఠాగూర్, గుర్జీత్ ఓజ్లా, రాజా వారింగ్, హిబి ఈడెన్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలు ఉన్నారు.స్పీకర్ తీరుకు నిరసనగా పార్లమెంట్ ఆవరణలో సస్పెండ్ అయిన ఎంపీల ఆందోళనకు దిగారు.రాహుల్ గాంధీ 'చైనా' కామెంట్స్‌పై ఉదయం నుంచి లోక్‌సభలో చర్చ జరిగింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు రసాభాసగా మారాయి. భారత్-చైనా సరిహద్దు వివాదానికి సంబంధించి మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం. నరవాణే ఇంకా ప్రచురించని పుస్తకం ఆధారంగా వచ్చిన కథనాన్ని ఉటంకిస్తూ.. భారత్ భూభాగాన్ని చైనా ఆక్రమించిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లోక్‌సభలో వ్యాఖ్యలు చేయడంతో వివాదం నెలకొంది. విపక్ష సభ్యులు.. సభాపతి చైర్ వైపు కాగితాలను విసిరేయడంతో గందరగోళం నెలకొంది. 8 మంది ప్రతిపక్ష ఎంపీలను లోక్‌సభ సస్పెండ్ చేసింది. ఈ వ్యాఖ్యల్ని హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా ఖండించారు. అనంతరం లోక్‌సభ కార్యకలాపాలు రేపటికి వాయిదా పడ్డాయి. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ లోక్ సభలో 8 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని.. 8 మందిలో తానూ ఉన్నానని తెలిపారు. స్పీకర్.. రాహుల్ గాంధీ మైక్‌ను కట్ చేయడాన్ని ప్రశ్నిస్తే సస్పెండ్ చేశారు. రాహుల్ గాంధీ ఎన్నో సందర్భాలలో వాస్తవాలు మాట్లాడే ప్రయత్నం చేస్తే సమావేశాన్ని వాయిదా వేసే విధంగా ప్రవర్తించారు. దేశ ప్రజల ముందు కాంగ్రెస్ ఎంపీల వలనే సభ వాయిదా పడుతున్నట్టు బీజేపీ ప్రచారం చేస్తున్నారు. నరేంద్ర మోదీ ట్రంప్‌కు సరెండర్ అయ్యారు. రాష్ట్రపతి ప్రసంగంపై జరుగుతున్న డిబేట్‌లో రాహుల్ గాంధీ మాట్లాడుతుంటే ఆయన మైకు కట్ చేశారు. ఆయన మైక్ కట్ చేస్తే మేము ఎందుకు కట్ చేశారని అడిగేందుకు స్పీకర్ పోడియం ముందుకు వెళ్లాం. 8 మందిపై కావాలనే సస్పెన్షన్ వేటు వేశారు. మా నోరు మూయించాలనే ప్రయత్నం బీజేపీ చేస్తుంది. మిగతా ఎంపీలందరూ మా తరఫున రేపు సభలో ప్రశ్నిస్తూనే ఉంటారు. రేపు పార్లమెంట్ ఆవరణలో సస్పెన్షన్ గురైన ఎనిమిది మంది ఎంపీలం ఆందోళన చేస్తాం. స్పీకర్ అనే వ్యక్తి ఏ కులానికి చెందిన వారనేది మేము చూడలేదు. మాకు అవకాశం ఇవ్వకపోవడంతోనే ఆందోళన చేశాం. మేం మాట్లాడుతుంటే మైకులు కట్ చేస్తున్నారు. బీజేపీ చిల్లర రాజకీయాలు చేస్తుంది" అని కిరణ్ కుమార్‌రెడ్డి మండిపడ్డారు.

# టీటీడీ పవిత్రతను కాపాడటం ప్రభుత్వ కర్తవ్యం

- శ్రీవారి ప్రసాదం నెయ్యి కల్తీని తీవ్రంగా పరిగణిస్తూ దోషులపై కఠిన చర్యలు
- స్వల్పకాలిక పరిపాలనా కమిటీని ఏర్పాటు చేసి ఈ అంశాన్ని సమగ్రంగా సమీక్షిస్తాం
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్



**అమరావతి, ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు కొలువైవున్న తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడటం ప్రభుత్వం ప్రథమ కర్తవ్యం అని, శ్రీవారి ప్రసాదం నెయ్యి కల్తీని తీవ్రంగా పరిగణిస్తూ దోషులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఈ అంశాన్ని సమగ్రంగా సమీక్షించి సత్వరమే తుది నివేదికను ప్రభుత్వానికిని సమర్పించేందుకు స్వల్పకాలిక పరిపాలనా కమిటీని ప్రభుత్వం నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారధి, నాదెండ్ల మనోహర్ మరియు సత్యకుమార్ యాదవ్ తో కలిసి మంత్రి పయ్యావుల కేశవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ నేడు జరిగిన క్యాబినెట్ సమావేశంలో అజండా అంశాలను ప్రక్కనబెట్టి మరీ తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) లడ్డు ప్రసాదంలో ఉపయోగించిన నెయ్యిలో జరిగిన కల్తీలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమర్పించిన నివేదికను సమగ్రంగా పరిశీలించడం జరిగిందన్నారు. ఈ నివేదిక, భారత సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సిబిఐ పర్యవేక్షణలో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా సమర్పించబడినదన్నారు. సిట్ నుండి ప్రభుత్వానికి రెండు పత్రాలు అందాయని, వాటిలో ఒకటి ఇప్పటికే కోర్టులో దాఖలు చేయబడిన చార్జ్ షీట్, మరొకటి ప్రభుత్వానికి ప్రత్యేకంగా పంపిన 11 పేజీల గోప్య నివేదిక అని తెలిపారు. కోర్టు చార్జ్ షీట్‌ను అధికారికంగా కాగ్నిజెన్సు లోకి తీసుకున్న తర్వాతనే అది ప్రభుత్వానికి మరియు సంబంధిత కక్షిదారులకు అందుబాటులోకి రానుందన్నారు. క్యాబినెట్ ముందు ఈ నివేదికను ఉంచి, అందులో పేర్కొన్న ప్రధాన అంశాలు మరియు తేలిన లోపాలపై విస్తృత స్థాయిలో చర్చ జరిగిందన్నారు. ప్రభుత్వానికి అందిన నివేదిక ప్రకారం, నెయ్యి సరఫరా, టెండర్ నిబంధనల సడలింపు, నాణ్యత లోపాలు మరియు తప్పుడు పత్రాల సమర్పణ వంటి తీవ్రమైన అవకతవకలు చోటుచేసుకున్నట్లు తేలిందన్నారు. సిట్ నివేదిక ప్రకారం, 2019 తర్వాత టిటిడి నెయ్యి కొనుగోలు విధానంలో అనవసరమైన సడలింపులు చేయడం ద్వారా నాణ్యతకు విరుద్ధమైన సరఫరాలు జరగడానికి అవకాశం కల్పించబడిందన్నారు. టెండర్ నిబంధనల్లో రూ.250 కోట్ల టర్నోవర్ షరతును రూ.150 కోట్లకు తగ్గించడం, కనీస పాల ప్రొక్యూర్మెంట్ అనుభవం లేకున్నా అర్హత కల్పించడం వంటి చర్యలు ఉద్దేశపూర్వకంగా చేపట్టబడ్డాయని నివేదిక స్పష్టం చేసిందన్నారు. నెయ్యి నమూనాలను పరిశీలించిన ఎన్డిటిబి, సిఐఎల్‌ఎఫ్ ల్యాబ్ నివేదికలో పలు సస్పెక్టెడ్ అడల్ట్రెంట్స్ (కల్తీ పదార్థాలు) సోయాబీన్, సన్‌ఫ్లవర్, రేప్‌సీడ్, కాటన్‌సీడ్, ఫిష్ ఆయిల్, బీఫ్ టాలో, లార్డ్ మొదలైనవి ఉన్న అవకాశం ఉన్నట్లు తేలిందన్నారు. ఈ నివేదిక ఆధారంగా గౌరవ ముఖ్యమంత్రి గారు ఆ రోజు ప్రజా వేదికపై ఈ అంశాన్ని ప్రస్తావించారన్నారు. అదే విధంగా టెండర్ నిబంధనలు ఉద్దేశపూర్వకంగా సడలింపులకు గురయ్యాయని, 2022లో CFTRI ల్యాబ్ ఇచ్చిన హెచ్చరికలను పట్టించుకోలేదని, సుమారు రూ.58 లక్షల లీటర్ల వరకు కల్తీ నెయ్యి సరఫరా జరిగినట్లు ఈ నివేదికలో వెల్లడించడం జరిగిందన్నారు. టెండర్‌లో పాల్గొన్న కొంత మంది సంస్థల తప్పుడు పత్రాలు సమర్పించి అర్హత పొందినట్లు స్పష్టమైందన్నారు. నివేదికలో శ్రీ ఏ.వి. ధర్మారెడ్డి గారు (ఈఓ), శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్ గారు (మాజీ ఈఓ), మరియు శ్రీ ఓ. బాలాజీ గారు (F&CAO) వంటి సీనియర్ అధికారుల పేర్లు ప్రస్తావించబడ్డాయన్నారు. వీరు టెండర్ నిబంధనలను సడలించడం మరియు నాణ్యత నియంత్రణలో విఫలమవడం ద్వారా బాధ్యత వహించాల్సినవారుగా సిట్ నివేదికలో పేర్కొనబడ్డారన్నారు.

# జనం కోరుకునేది కేసీఆర్ పాలనే!!

- రామగుండంలో ఎగిరేది గులాబీ జెండానే
- కాంగ్రెస్ కూల్చివేతల పాలనకు చరమగీతం పాడుదాం
- అబద్ధపు హామీలకు అంతం తప్పదు
- బీఆర్ఎస్ మేయర్ అభ్యర్థి కల్వల నారాయణను గెలిపిద్దాం
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్





**పెద్దపల్లి/ గోదావరిఖని,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** జనం కోరుకునేది కేసీఆర్ పాలనే అని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం రామగుండం నగరపాలక సంస్థ 43వ డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ మేయర్ అభ్యర్థి కల్వల నారాయణను భారీ మెజారిటీతో గెలిపించాలని డివిజన్ ప్రజలను కోరుతూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ....... అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు అసహ్యించుకుంటున్నారని, మళ్ళీ గులాబీ పాలననే కోరుకుంటున్నారని పేర్కొన్నారు. గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రామగుండం నియోజకవర్గం కూల్చివేతలు, కమీషన్లకు నిలయంగా మారిందని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం కాంగ్రెస్ నేతలకు పరిపాటిగా మారిందని ఆయన ధ్వజమెత్తారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతంలోని చిరు వ్యాపారుల దుకాణాలను కూల్చివేసి వారిని రోడ్డున పడేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మోసపూరిత పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపు ఐలయ్య యాదవ్, నడిపెల్లి మురళీధర్ రావు, పెంట రాజేష్, నారాయణదాసు మారుతి, బుర్రి వెంకటేష్ తదితరులు పాల్గొని బీఆర్ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు శ్రమించాలని పిలుపునిచ్చారు.


## పాస్‌పోర్టు పోయినది

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ అర్బన్, కేదారేశ్వరపేట, లోటస్ ల్యాండ్‌మార్క్, సెక్టార్-1, రోడ్డు నెం.8, ప్లాటు నెం.5 కాపురస్తురాలు గొల్లపూడి వెంకట నాగ పార్ధసారధి గారి కుమార్తె గొల్లపూడి వెంకట కిరణ్ వల్లవి అను నాపేరిట హైదరాబాద్ పాస్‌పోర్టు కార్యాలయంలో ది.31-07-2014లో జారీచేసిన ఒరిజినల్ పాస్‌పోర్టు నెం.యం0621365 మరియు కొన్ని కాగితములు కలిగిన కవర్‌ను ది.20-01-2026వ తేదీన బండిపై ఇంటి వద్ద నుండి సత్యనారాయణపురం శివాజీకేఫ్ సెంటర్‌లో జిరాక్సు షాపుకు వెళ్లుచుండగా మార్గమధ్యంలో జారిపడి పోయినది. వెంటనే పరిసర ప్రాంతంలో వెదకిననూ కనిపించలేదు. సదరు పాస్‌పోర్టును ఉపయోగించి, ఎవ్వరైనా ఎటువంటి అన్యాక్రాంతములు జరిపిన యెడల చట్టప్రకారం తీసుకునే యావత్తు చర్యలకు బాధ్యులు కాగలరని తెలియ జేయుచూ, ఎవరికైనా ఒరిజినల్ పానుపోర్టు దొరికినచో నాకు తెలియపరచినచో తగిన పారితోషకం ఇవ్వబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

సెల్ నెం. 9959644564

## పాస్‌పోర్టు పోయినది

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ అర్బన్, సీతారామపురం, రైవస్ కాల్వ, డోరు నెం.30-24-159బి కాపురస్తుడు కలకట్ల వెంకటేశ్వరరావు గారి కుమారుడు కలకట్ల అనిల్ అను నాపేరిట విజయవాడ పాస్‌పోర్టు కార్యాలయంలో ది.11-05-2021లో జారీచేసిన ఒరిజినల్ పాస్‌పోర్టు నెం.వి1940591 మరియు కొన్ని కాగితములు కలిగిన కవర్‌ను ది.25-01-2026వ తేదీన బండిపై ఇంటి వద్ద నుండి అరండల్‌పేటలో జిరాక్సు షాపుకు వెళ్లుచుండగా మార్గమధ్యంలో జారివడిపోయినది. వెంటనే వరిసర ప్రాంతంలో వెదకిననూ కనిపించలేదు. సదరు పాస్‌పోర్టును ఉవయోగించి, ఎవ్వరైనా ఎటువంటి అన్యాక్రాంతములు జరిపిన యెడల చట్టప్రకారం తీసుకునే యావత్తు చర్యలకు బాధ్యులు కాగలరని తెలియ జేయుచూ, ఎవరికైనా ఒరిజినల్ పానుపోర్టు దొరికినచో నాకు తెలియపరచినచో తగిన పారితోషకం ఇవ్వబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

సెల్ నెం. 6300585512


# రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి ఉప్పాల రాము

- ప్రకటించిన పార్లమెంటు పార్టీ పరిశీలకులు జెట్టి గురునాథం



**పెడన,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** రానున్న ఎన్నికల్లో ఉప్పాల రాము వైసిపి అభ్యర్థి అని పార్లమెంటు వైసిపి పరిశీలకులు జెట్టి గురునాథం అన్నారు. ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకోవలసిన బాధ్యత మీదేనని చెప్పారు. నియోజకవర్గ వైసిపి విస్తృతస్థాయి సమావేశం మంగళవారం సాయంత్రం స్థానిక వైసీపీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి సంబంధించి 22 విభాగాలుకు 18 మందితో కమిటీ వేయాలి అన్నారు. రాము మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టవంతం చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక గూడూరు ఎంపీపీ సంఘా మధుసూధన రావు అధ్యక్షత వహించగా జడ్పీటీసీ మైలా రత్నకుమారి ఎంపీపీ లు రాజులపాటి వాణి వెలివల చినబాబు కూనసాని గరుడప్రసాద్ కటకం ప్రసాద్ బండారు మల్లిఖార్జునరావు బళ్ళ గంగయ్య రాజులపాటి అచ్యుతరావు జన్ను నాగమల్లేశ్వరావు మహ్మద్ ఖాజా కొండవీటి నాగబాబు గరికపాటి రామా నాయుడు కర్ణ శ్రీనివాసరావు పిన్నింటి మహేష్ వన్నం శ్రీలత జన్యావుల ఝాన్సీ నల్లా నాగలక్ష్మి బొడ్డు శ్యామల దేవి వట్టికూటి విశ్వేశ్వరావు మట్టా నాగబాబు జల్లా భూపతి ముత్యాల నాగేశ్వరావు సిరివెళ్ల జయేష్ పిచ్చిక సతీష్ రౌతుల ప్రసాద్ మాదాసు బాబురావు అత్తావుర్ రెహమాన్ వన్నెంరెడ్డి మహంకాళరావు కాగిత శ్రీహరి కృష్ణప్రసాద్ గుడిసేవ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. తొలుత వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఇటీవల భృతి చెందిన వైసిపి నాయకుల కు శ్రద్ధాంజలి ఘటించారు.

# ఆరవ వార్డులో సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కటకం



**పెడన,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** పెడన మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగ కుమారి ఆదేశాల మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులతో పట్టణంలో గల స్థానిక 6వ వార్డు లోని రేష్మ ఇంటి వద్ద నుంచి షేక్ అబ్దుల్ రషీద్ ఇంటి వద్ద వరకు అంచనా విలువ సుమారు లక్షలు 1.05 వేల రూపాయలతో కొత్తగా ఏర్పాటు చేయుచున్న సిమెంట్ రోడ్ పనులను పర్యవేక్షించిన సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ ఖయ్యూం బాబులాల్ 6 వ వార్డు ఇంచార్చ్ అబ్దుల్ గఫార్ ఏఈ కాగిత సీతారామాంజ నేయులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పట్టాదార్ పాసు పుస్తకాలు పంపిణీ చేసిన ఆర్డిఓ మాధురి



**తిరువూరు,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** తిరువూరు మండలం లక్ష్మీపురం గ్రామంలో తహసీల్దార్, నాగమణి ఆధ్వర్యంలో పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీ గ్రామసభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్డీవో రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు ఆర్డీవో మాధురి రైతులతో మాట్లాడుతూ, పట్టాదారు పాస్‌బుక్స్ వారి భూమి అంత నమోదు అయ్యిందా లేదా మరొకసారి సరి చూసుకోవాలని తెలియజేశారు ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న విషయాన్ని ఈ పాస్ పుస్తకాలు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం, తిరువూరు మండలం లక్ష్మీపురం గ్రామంలో ఉన్న మామిడి రోశయ్య చౌక ధరలు దుకాణం నెం. 0613031 ను రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ గారు ఆకస్మిక తనిఖీ చేశారు. రేషన్ సరుకుల నిల్వలు, పంపిణీ విధానం, రికార్డులను పరిశీలించి, నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించాల్సిందిగా సూచనలు చేశారు. తదుపరి లక్ష్మీపురం గ్రామంలో ఉన్న విజయ వెంకటేశ్వర అగ్రో ఇండస్ట్రీస్ (రైస్ మిల్) ను కూడా రెవెన్యూ డివిజనల్ అధికారి తనిఖీ చేశారు. ఈ తనిఖీల లో తహసీల్దార్, తిరువూరు వై. నాగమణి మరియు పీడీఎస్ డీటీ శ్వేత పాల్గొన్నారు. ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, రికార్డుల నిర్వహణను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలనీ లేనియడల తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు

# అంగన్వాడీ కార్యకర్తలు నిరసన




**తిరువూరు,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఐసీడీఎస్ శాఖకు నిధులు కేటాయించకపోవటం పట్ల సీఐటీ యూ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తిరువూరు ఐసీడీ ఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని సీఐటీయూ మండల కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు ఆరో పించారు. పోరాడి సాధిం చుకున్న ఉద్యోగ, కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తు ఒదని, అందుకు లలేబర్ కోడ్ ను రద్దు చేయటాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 12వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు.

# పాఠశాలకు కంప్యూటర్ బహుకరణ



**ఎరుకోపాడు(తిరువూరు రూరల్),ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** తిరువూరు మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (పీఎం శ్రీ స్కూల్) ఎరుకోపాడు విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సామాజిక సేవా దృక్పథంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరువూరు బ్రాంచ్ వారు ఎరుకోపాడు ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్ని మంగళవారం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ స్టేట్ బ్యాంకు, తిరువూరు శాఖ చీఫ్ మేనేజర్ శ్రీ దాసరి నాగన్న గారు, క్యాష్ ఆఫీసర్ శ్రీ బి ఎల్ హెచ్ ప్రసాద్ గారు, పాఠశాలప్రధానోపాధ్యాయులు యం. సాంబశివరావు గారు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తూతాపురి మామిడి టన్ను 95000

● మ్యాంగో అండ్ చిల్లీస్ గ్రోయర్ అధినేత రాయల కిట్టు



**విస్సన్నపేట,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలోని కిట్టు మ్యాంగో అండ్ చిల్లీస్ గ్రోయర్స్ అధినేత రాయల కిట్టు మీడియాతో మాట్లాడుతూ రెండు టన్నుల నర మామిడి ఎగుమతులను సోమవారం సాయంత్రం బొంబాయి మార్కెట్ కి పంపించడం జరిగిందని ఆయన చెప్పారు. టన్ను 95 వేల రూపాయలు ధర పలుకుతుందన్నారు.

# జాస్మిన్ ఆయిల్ ఎక్స్ట్రాక్షన్ పరిశ్రమను సందర్శించిన చంద్రగూడెం మల్లె సాగు రైతులు







**మైలవరం,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** జాస్మిన్ ఆయిల్ ఎక్స్ట్రాక్షన్ పరిశ్రమను చంద్రగూడెం గ్రామానికి చెందిన మల్లె సాగు రైతులు సందర్శించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యాన శాఖ ఎన్టీఆర్ జిల్లా వారి రైతు విజ్ఞాన యాత్రలో భాగం గా విజన్ 2047 విజన్ కింద మైల వరం మండల ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మండల ఉద్యాన అధికారి అహ్మద్ సోహైల్, పిఏసిఎస్ చైర్మన్ మోర్ల వెంకట రోశాలు పర్యవేక్షణలో తమిళనాడు రాష్ట్రంలోని మధురై పరిసర ప్రాంతాలలో నీలకొట్టాయి గ్రామంలో ఉన్న సుగంధ ద్రవ్యాల తయారీ పరిశ్రమను చంద్రగూడెం మల్లె సాగు రైతులు సందరించి జాస్మిన్ (మల్లె) లిక్విడ్ తయారీ విధా నాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.విజన్ యాక్షన్ యూనిట్ ప్రణాళికలో భాగంగా మైలవరం ఎమ్మెల్యే సూచనల మేరకు రైతులు రైతు విజ్ఞాన యాత్ర కు ఎంతో ఉత్సాహంగా తరలి వెళ్లారు. జాస్మిన్ ఆయిల్ ఎక్స్ట్రాక్షన్ పరిశ్రమ ఏర్పాటుకు ఎంత ఖర్చవుతుంది, ఒక టన్ను పూలకి ఎంత జాస్మిన్ లిక్విడ్ తయారవుతుంది, దానివల్ల ఎంత లాభం వస్తుం ది,యూనిట్ కాస్ట్ ఎంత, ఆ ఫ్యాక్టరీ నిర్మాణానికి కి ఎన్ని ఎకరాల స్థలం కావాలి, ఎక్సపోర్ట్ ఎలా చేయాలి, పూలను రైతుల నుంచి ఎంత ధరకు కొనుగోలు చేస్తున్నారు, ప్రాసెసింగ్ తర్వాత ఎంత ధరకు అమ్ముతు న్నారు తదితర అంశాల గురించి ఫ్యాక్టరీ యాజమాన్యంతో రైతులు ము ఖముకి మాట్లాడారు.ఫ్యాక్టరీ మేనేజర్ పొన్నియన్ సెల్వన్ రైతులతో మాట్లాడుతూ అంతర్జాతీయం గా జాస్మిన్ ఆయిల్ కి మంచి గిరాకీ ఉందని, దీనిని ఫార్మసీ కంపెనీలలో, సెంటు తయారీ, సబ్బులు, షాం పు, చర్మ సంరక్షణ, అగర్బత్తి తయారీలో వాడుతున్నారని వివరించారు. ఇలాంటి ఫ్యాక్టరీ మైలవరం పరిసర ప్రాంతంలో ఉంటే మల్లెపూలకు మంచి డిమాండ్ ఉంటుందని రైతులు తమ ఆశాభావం వ్యక్తం చేశారు.

# సమిష్టి కృషితో అధిక ఉత్తీర్ణత సాధిద్దాం

-ప్రత్యేక అధికారి (ఎంపీడీవో )చిన్న రాట్నాలు






**విసన్నపేట,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న 100 డేస్ యాక్షన్ ప్లాన్ ద్వారా 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులు అత్యధిక శాతం ఉత్తీర్ణ సాధించేందుకు సమిష్టిగా కృషి చేద్దామని ప్రత్యేక అధికారి ఎంపీడీవో చిన్న రాట్నాలు గురుకుల పాఠశాలలు పర్యవేక్షణ కార్యక్రమంలో తెలియజేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ కార్యక్రమం 100 రోజులు 100 పరీక్షలు ప్రతిరోజు ఒక సబ్జెక్టుపై 90 నిమిషాలు అంటే రెండు పీరియడ్లు ఏకాగ్రతతో ఇష్టంగా చదువుకోవడం తర్వాత గంట సమయంలో 20 నిమిషాలు మార్కులకు విద్యార్థులు ఆన్సర్లు అందించడం అనే ప్రక్రియ బిలో యావరేజ్ స్టూడెంట్ ని కూడా ఎక్కువ మార్కులు సాధించేందుకు వైకుంఠపాళీ చిత్రపటంలో పదో తరగతి పాస్ అనే నిచ్చెన లను అధిరోహిస్తూ పరమపద సోపానం సాధించేందుకు మహోన్నతంగా ఉన్నది అన్నారు. విద్యార్థిని విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్క విద్యార్థి తోటి వారి కన్నా ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని ఆసక్తితో ముందడుగు వేయడం జరుగుతుందని సబ్జెక్టు పరంగా టీచింగ్ సిబ్బంది తమ వంతు భరోసా అందించాలని వాళ్ళ అనుమానాలను తక్షణమే నివృత్తి చేయవలసిన అవసరం ఉన్నదని ఆయన చెప్పారు. అత్యధిక స్కోరు సాధించి ట్రిబుల్ ఐటీ నందు ఎక్కువ సీట్లు సాధించాలన్నారు.

# యల్.బి.ఆర్.సి.ఈ లో అంతర్-రాష్ట్ర యువజన మార్పిడి సదస్సు






**మైలవరం,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ సారథ్యంలో నిర్వహిస్తున్న మై భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల యన్.యస్.యస్. యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్-రాష్ట్ర యువజన మార్పిడి సదస్సు ప్రారంభమయ్యింది.ఈ సదస్సు ఐదు రోజుల పాటు అనగా 03 ఫిబ్రవరి 2026 నుంచి 07 ఫిబ్రవరి 2026 జరుగనుంది.మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా స్టేట్ యన్.యస్. యస్ ఆఫీసర్ డా.యమ్.సుధాకర్ మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాల యువత మధ్య సాంస్కృతిక అవగాహన, జాతీయ సమగ్రతను మరియు 'ఏకభారతం-శ్రేష్ఠ భారతం' స్ఫూర్తిని పెంపొందించడానికి రూపొందించబడిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా యువకులు వేరే రాష్ట్రాల సంస్కృతులు, సాంప్రదాయాలు, జీవనశైలి మరియు సామాజిక-ఆర్థిక అంశాలను ప్రత్యక్షం గా అనుభవిస్తారని అన్నారు.వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి మాట్లాడుతూ కేరళ రాష్ట్ర నుంచి 37 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారని,వారికి ఆంధ్ర రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, భాష, సామాజిక జీవన విధానం గురించి అవగాహన కలుగుతుందని తెలిపారు. కేరళ రాష్ట్ర నుంచి వచ్చిన యువత తో పరస్పర సంభాషణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వర్క్‌షాపులు, చర్చా వేదికల ద్వారా జాతీయ ఐక్యత, సామాజిక బాధ్యత మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించు కోనున్నారని అలాగే ఆంధ్రలోని చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యత గల ప్రాంతాలను సందర్శించి, రాష్ట్ర అభివృద్ధి నమూనాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాల అమలు విధానాలపై అవగాహన పొందుతారని తెలిపారు. మై భారత్ జిల్లా యువ అధికారి సుంకర రాము మాట్లాడుతూ ఈ కార్య క్రమంలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి భావన, భిన్నత్వంలో ఏకత్వం అనే ఆలోచన మరింత బలపడుతుందని,ఇలాంటి కార్యక్రమా లు యువతను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తా యని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మై భారత్ కోఆర్డినేటర్ వినోద్, ఎన్టీఆర్ జిల్లా యన్.యస్.యస్. ఆఫీసర్ డా.రమేష్ , ఎ.పి. యస్.యస్.డి.సి. కళాశాల అసిస్టెంట్ యన్.యస్.యస్. యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్, శీలం ఉమా మహేశ్వర రెడ్డి, కేరళ రాష్ట్ర విద్యార్థిని, విద్యార్థులు, కళాశాల యన్.యస్.యస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

# అధిష్టానం మెప్పు కోసం మైలవరంలో ప్రశాంత వాతావరణం చెడగొడుతున్నారు-పులిపాక



**జి.కొండూరు,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** అధిష్టానం మెప్పు కోసం కొంతమంది రాజకీయ నాయకులు మైలవరంలో ప్రశాంత వాతావరణాన్ని చెడగొడుతున్నారని జనసేన నాయకులు పులిపాక ప్రకాష్ బాబు పేర్కొన్నారు.మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎంతోమంది రాజకీయ దురంధరులు మైలారానికి ప్రాతినిధ్యం వహించారనీ, మైలవరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నప్పటికీ ఒక పక్క రాజకీయ ప్రత్యర్థులు విమర్శిస్తూనే ఉండేవారని అయినా వారు వారి విమర్శల్ని స్వీకరిస్తూ మైలవరం అభివృద్ధికి,ప్రశాంతతకి కట్టుబడి ఉండేవారని తెలిరాజేశారు.కానీ ఈ మధ్య కాలంలో వలస వచ్చిన నాయకులు వలన అభివృద్ధి సంగతి ఏమోగానీ మైలవరం నియోజకవర్గం ప్రశాంతత కోల్పోతోందని ప్రకాష్ బాబు ఆరోపించారు. ఏ విషయాన్ని అయినా రాజకీయంగా ఎదుర్కోవాలి గాని వ్యక్తిగతంగా కక్షగట్టి ఇళ్లపైకి దాడి చేసి ఇల్లను తగలబెడతాం అనేది సరికాదన్నారు.ఈ సంస్కృతి మైలవరం నియోజకవర్గంలో ఎన్నడూ లేదన్నారు.ఈ నియోజకవర్గంలో ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు ఎలక్షన్ వరకే ఎవరికివారు విడిగా ఉండేవారని తర్వాత అందరూ కలిసిమెలిసి ఉంటారు అన్నారు.అయితే స్థానికేతర్లు తమ స్వార్థ రాజకీయాల కోసం కొందరిని ప్రలోభ పెట్టి రాజకీయ అవసరాలు తీర్చుకుంటున్నారని విమర్శించారు.ఆయా రాజకీయ పార్టీల అధిష్టానం మెప్పు కోసం ప్రశాంత వాతావరణం చెడగొడుతున్నారని ఆకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. జోగి ఇంటి మీద జరిగిన దాడిలో మైలవరం నియోజవర్గం సంబంధం లేని వ్యక్తులు పాల్గొన్నారని వింటుంటే మరీ విచిత్రంగా ఉందన్నారు.ఇది జోగి మీద దాడి మాత్రమే కాదు మైలవరం నియోజకవర్గ మీద జరిగిన దాడిగా వర్ణిస్తూ జనసేన పార్టీ నాయకుడిగా తాను ఖండిస్తున్నానని ప్రకాష్ స్పష్టంచేశారు.

# అబుదాబి గేమ్స్ పోటీలకు టౌన్ హాల్ సభ్యులు



**కాకినాడ ,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** అబుదాబి లో ఈ నెల 6 నుండి 15 వరకు జరగనున్న ఓపెన్ మాస్టర్ గేమ్స్ లో పాల్గొనేందుకు భారతదేశం తరపున ఆంధ్ర నుండి ఆరుగురు సభ్యుల కలిగిన బృందం బయలుదేరి వెళు తుంది. ఈ బృందంలో కాకినాడ లిటరరీ అసోసియేషన్ (టౌన్ హాల్ )చెందిన ముగ్గురు పెద్దాపురం టౌన్ హాల్ కు చెందిన ముగ్గురు సభ్యులు ఉండడం గర్వకారణం. ఈ బృందానికి మంగళవారం స్థానిక టౌన్ హాల్ టెన్నిస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఘనంగా సత్కరించారు. ఈ బృందంలో టౌన్ హాల్ కు చెందిన బసవా ప్రసాద్, విల్లా ప్రకాష్, ఎం ఎస్ ప్రసాద్ తో పాటు పెద్దాపురం టౌన్ హాల్ కు చెందిన ముప్పన స్వామి ఇంద్ర రాజు ఆర్వి రామరాజు లు ఉన్నారు. బసవ ప్రసాద్ మాట్లాడుతూ కాకినాడ టౌన్ హాల్ కు చెందిన తాము అంతర్జాతీయ క్రీడల పోటీలకు బయలుదేరి వెళ్లడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ పోటీలకు ప్రపంచ వ్యాప్తంగా 100 దేశాల నుండి క్రీడాకారులు పాల్గొంటున్నారని అందులో ఆంధ్ర నుండి తాము ఆరుగురు సభ్యులు ఉండడం గర్వకారణంగా ఉందన్నారు. క్రీడాకారుల ను ప్రోత్సహించడంలో టౌన్ హాల్ కమిటీ ఎప్పుడు ముందు ఉంటుందని చెప్పారు. టౌన్ హాల్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వివిధ రకాల పోటీలు కూడా నిర్వహణకు ఆతిథ్యం ఇచ్చిన విషయాన్ని బసవ ప్రసాద్ గుర్తు చేశారు. క్రికెట్ పోటీలతోపాటు ఇతర క్రీడా పోటీలను కూడా ప్రోత్సహించడంలో టౌన్ హాల్ కమిటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ప్రస్తావించారు. తమను ఘనంగా సత్కరిస్తూ పోటీలలో పాల్గొనడానికి వీడ్కోలు పలకడం ఎంతో ఆనందాన్ని కలిగి చేసిందని ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకున్నారు. టౌన్ హాల్ కమిటీ అధ్యక్షులు వి. ఆనంద్, కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వర రావు, టెన్నిస్ కమిటీ కార్యదర్శి లక్ష్మణ్, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు ల ఆధ్వర్యంలో బ్లాజర్స్ అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో టౌన్ హాల్ కమిటీ ఉపాధ్యక్షులు డివిఎన్ రాజు ,సంయుక్త కార్యదర్శి వై వి ఎస్ నాయుడు, కోశాధికారి నెక్కంటి శ్రీనివాస్ ,సభ్యులు పసుపులేటి శ్రీనివాసరావు, బచ్చు శేఖర్, దంగేటి ప్రసాద్, వేపకాయల రామకృష్ణ, ముళ్ళపూడి రాంబాబు , తాళ్లరేవు వర్మ, పలువురు పాల్గొన్నారు.

# వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఫిర్యాదు



**కాకినాడ,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నాయకులు అంబటి రాంబాబు, జోగు రమేష్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) మంగళ వారం కాకినాడలోని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ప్రజాప్రతినిధులు వ్యక్తిగత దూషణలకు పాల్పడటం సరికాదన్నారు. సీఎం చంద్రబాబు ప్రతిష్ఠను దిగజార్చేలా చేసిన వ్యాఖ్యలపై తక్షణమే కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను వనమాడి కోరారు. పోలీసులు ఫిర్యాదును స్వీకరించి ఈ విషయంపై విచారణ చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మల్లిపూడి వీరు, బచ్చు శేఖర్, పలివెల రవి అనంత కుమార్, తుమ్మల సునీత, అమన్ జైన్, గదుల సాయిబాబు, కొల్లాబత్తుల అప్పారావు, చింతలపూడి రవి తదితరులు పాల్గొన్నారు.

# మానవత ఆధ్వర్యంలో 12 హైస్కూల్స్ లో 10 వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు



**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వారిచే బాపులపాడు మండలం రేమల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ లో మంగళవారం పదవ తరగతి విద్యార్థులకు నైతిక విలువలు,వ్యక్తిత్వ వికాసం జీవన నైపుణ్యాలు అనే అంశాలపై జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత,మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు కెరీర్ గైడెన్స్ నిర్వహించారు.ఇప్పటికే రామన్నగూడెం,మల్లవల్లి,జ్యోతి నగర్ హైస్కూల్స్ లో కూడా కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహించినట్లు మారుబోయిన తెలిపారు.గత సంవత్సరశీ 6,7,8,9 తరగతిలో ప్రథమ ద్వితీయ స్థానములు సాధించిన విద్యార్థులకు 1000, 500 రూపాయల చొప్పున నగదు బహుమతి తో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రము ప్రతి స్కూల్ కు 8000 వేల రూపాయల విలువగలవి అందిస్తున్నామన్నారు. హనుమాన్ జంక్షన్ ప్రాంతంలో ఉన్న 12 జిల్లా పరిషత్ హైస్కూల్స్ లో ఈ కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు లూడర్ పాల్,మానవత బాధ్యులు గంటా ఇందిరా దేవి, పాబోలు గణేష్ బాబు, కొట్నాని రామచంద్రరావు పాఠశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ సభలో కవి గద్వాల సోమన్న



**అనంతపురం,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** నందవరం మండల పరిధిలోని జడ్పీహెచ్.యస్ నాగలదిన్నెలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న బాలబంధు గద్వాల సోమన్న పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు.పెద్దవడుగూరుమండలం జడ్పీహెచ్.యస్ క్రిష్టిపాడులో ప్రధానోపాధ్యాయులు శ్రీ టి. యస్వి రవికుమార్ రిటైర్మెంట్ ఫంక్షన్ లో పాల్గొని వారిపై కవితాగానం చేస్తూ.. శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, పుర ప్రముఖులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12 జరిగే అఖిలభారత సమ్మెను జయప్రదం చేయండి... సిఐటియు నాయకులు...



**కృత్తివెన్ను,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ) :** బంటుమిల్లి మండలంలోని బంటుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,పెద్ద తుమ్మడి ఆరోగ్య కేంద్రంలో ఫిబ్రవరి 12వ తారీకు అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ డాక్టర్ లు, డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ సువర్చల లకు సమ్మె నోటీస్ బంటుమిల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలో, పెదతుమ్మిడి ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశా వర్కర్లు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ మాజేటి శివ శ్రీనివాసరావుమాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కుల కాల్ రాస్తుందని పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికులకు హాని కలిగించే కార్మికుల హక్కులను కలరాసి నాలుగు కార్మిక కోడ్లను తీసుకువచ్చిందని వాటిని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు రేపు ఫిబ్రవరి 12వ తారీఖున ఉద్యోగ కార్మికులు కాంట్రాక్ట్ ఔర్ సోర్సింగ్ అసంఘటిత కార్మికులు స్కీం వర్కర్లు లక్షలాదిమంది ఈ సమ్మెలో పాల్గొంటున్నారని ఈ సమ్మెను ప్రతి ఒక్కరు మద్దతు తెలియజేయాలని ఆయన కోరారు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మాట్లాడే స్వేచ్ఛ నిరసన తెలియజేసే హక్కు రాజ్యాంగం మనకు కల్పించిందని రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో పెద్ద తుమ్మిడి పీహెచ్సీ లీడర్ ఝాన్సీ ప్రభావతి రాణి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు....

# బాచుపల్లి స్మశాన వాటికను కొనసాగించాలి.

**:' మంత్రి శ్రీధర్ బాబుకు కొలన్ హన్మంత్ రెడ్డి వినతి**
**50 ఏళ్ల చరిత్ర కలిగిన స్మశాన వాటికను తొలగించవద్దు**
**తొలగిస్తే 50 వేల మంది ప్రజలకు ఇబ్బందులు**
**సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు**



**కుత్బుల్లాపూర్/బాచుపల్లి, జనవరి 3, (వార్తాప్రభ)** :బాచుపల్లి ప్రాంతంలో దశాబ్దాల కాలంగా ప్రజలకు అందుబాటులో ఉన్న స్మశాన వాటికను యథావిధిగా కొనసాగించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ని కలిసి సమస్యపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ.. బాచుపల్లిలో గత 50 సంవత్సరాలుగా ఈ స్మశాన వాటిక కొనసాగుతోందని, సుమారు 50 వేల మంది ప్రజలు దీనిపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. ఇటీవల వెలసిన కొన్ని కాలనీల నివాసులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారనే నెపంతో దీన్ని తొలగించడం సరికాదన్నారు. గతంలో ఎంపీపీ మరియు మున్సిపల్ కార్పొరేషన్ హయాంలో ఈ స్మశాన వాటిక అభివృద్ధి కోసం ప్రభుత్వ నిధులు కూడా వెచ్చించిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ సమస్యపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో చర్చించి, స్థానిక గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, చట్టపరంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బాచుపల్లి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో కె.యం. ప్రతాప్ ప్రత్యేక పూజలు

**వైభవంగా సాగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలు**
**నియోజకవర్గ ప్రజలకు అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థన**





**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 3, (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కేంద్రమైన కుత్బుల్లాపూర్ గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం. ప్రతాప్ ముఖ్య అతిథిగా విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. వేణుగోపాలస్వామి ఆశీస్సులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నానని ఆయన పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఠాకూర్ రాజేందర్ సింగ్, ఆలయ కమిటీ సభ్యులు కూన శ్రీరాములు గౌడ్, నల్ల లింగం గౌడ్, ఉప్పీ సత్తయ్య, నరహరి గౌడ్, ఠాగూర్ విజయేందర్ సింగ్, మురళి గౌడ్, నక్క ప్రకాష్, నార్ల కంటి శ్యామ్ కురుమ, గార శ్రీనివాస్, కమలాకర్ గౌడ్, ప్రవీణ్ జోషి, నరేష్, శాతూరు మహేష్, దన్నారం శ్రీనివాస్ గౌడ్, బలవంత్ రెడ్డి, సురేష్ మరియు కుత్బుల్లాపూర్ గ్రామ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గౌతమ్ నగర్ లో అభివృద్ధి పనులు ప్రారంభం

**: కార్పొరేటర్ మేకల సునీత యాదవ్**



**మల్కాజిగిరి : ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గౌతమ్ నగర్ డివిజన్ అభివృద్ధి లక్ష్యమని కార్పొరేటర్ మేకల సీతారామ్ యాదవ్ తెలిపారు. డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనీ లో రోడ్ నెంబర్ 8, రోడ్ నెంబర్ 10, రోడ్ నెంబర్ 12 లో 25 లక్షల రూపాయల వ్యయం తో నిర్మించ తలపెట్టిన సిసి రోడ్ నిర్మాణం పనులను ఆమె మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ప్రారంభించారు ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గౌతమ్ నగర్ డివిజన్ ప్రజలకు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా నెరవేస్తున్నానని తెలిపారు అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ పట్నాయక్ బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్జీ-1లో "జీఎం" సర్కార్!!

**● మీడియా అంటేనే గుబులు ● ప్రశ్నలంటేనే వణుకు ● ప్రకటన పెడతాం....రాసుకోండి ● సింగరేణికి కొత్త సుప్రీంలాగా యాటిట్యూడ్ ● అధికారి ప్రవర్తనకు మీడియా బలి? ● నాల్గవ స్తంభంపై అణిచివేత ధోరణి ● ఎవరి అండతో ఈ రెచ్చిపోవడం?**




**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 3 (వార్తాప్రభ ప్రతినిధి)** సింగరేణి సంస్థలోని రామగుండం రీజియన్-1 (ఆర్జీ-1) జనరల్ మేనేజర్ తీరు ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సంస్థ మనుగడలో మీడియా పోషించే కీలక పాత్రను విస్మరించి, పత్రికా, టీవీ ప్రతినిధులను తొక్కేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతుండటమే కాదు స్పష్టంగా వినిపిస్తున్నాయి, కనిపిస్తున్నాయి. సాధారణంగా ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా పారదర్శకత కోసం ప్రెస్ మీట్లు నిర్వహించడం ఆనవాయితీ, కానీ ఇక్కడ మాత్రం జీఎం కార్యాలయం మీడియాను చూసి జంకుతున్నట్లు స్పష్టమవుతోంది. జర్నలిస్టులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు లేకనో, లేక తప్పులు బయటపడతాయన్న భయంతోనో కానీ, ప్రెస్ మీట్ పెట్టకుండా మీడియాను ఏకంగా బాయ్‌కాట్ చేయడం విస్మయానికి గురిచేస్తోంది. సింగరేణిలో తాను ఒక సుప్రీంలాగా వ్యవహరిస్తూ, మిగతా ఏ ఏరియాలో లేని వింత విధివిధానాలను కేవలం ఆర్జీ-1లోనే అమలు చేస్తూ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సంస్థ అభివృద్ధికి తోడ్పడాల్సిన అధికారి, తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ మీడియా




గొంతు నొక్కడానికి ఎవరి అండదండలు ఉన్నాయన్నది ఇప్పుడు మిస్టరీగా మారింది. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభమైన మీడియాను దూరం పెడుతూ, పారదర్శకతను తుంగలో తొక్కుతున్న సదరు అధికారి తీరుపై కార్మిక లోకంలోనూ, యూనియన్ నాయకుల్లోనూ, సామాన్య ప్రజల్లోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆర్జీ-1లో నెలకొన్న ఈ అసాధారణ పరిస్థితులపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నీతి వ్యాఖ్యల పరిచయస్థుడికి మంచి బుద్ధి, జ్ఞానం పరిచయం చేయాలని అన్ని వర్గాల డిమాండ్ వినిపించడం కొస మెరుపు.

# కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు!!

**● గోడ రాతలపై నిషేధం ● మైక్ సెట్లు, ర్యాలీలకు పర్మిషన్ తప్పనిసరి ● ఉల్లంఘనలు జరిగితే అభ్యర్థులదే బాధ్యత ● గోదావరిఖని వన్టౌన్ ఎస్.హెచ్.ఓ. ఇంద్రసేనారెడ్డి**



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 3 (వార్తాప్రభ ప్రతినిధి)**ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గోదావరిఖని వన్టౌన్ ఎస్.హెచ్.ఓ. ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం మారుతినగర్, విఠల్ నగర్‌లలో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ......ఫిబ్రవరి 16 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, ప్రజలు అలాగే అభ్యర్థులు పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, వ్యక్తిగత దూషణలు చేయడం, అనుమతి లేకుండా గోడలపై పోస్టర్లు అంటించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ప్రచారం ఉదయం 6 నుండి రాత్రి 10 గంటల వరకే నిర్వహించాలని, మైకులు, ర్యాలీలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజున కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో ఉండాలని, లోపలికి మొబైల్ ఫోన్లు అనుమతించబడవని స్పష్టం చేశారు. గెలుపోటముల తర్వాత ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, టపాకాయలు కాల్చడం వంటివి చేయకూడదని, అభ్యర్థులు తమ అనుచరుల ప్రవర్తనకు బాధ్యత వహించాలని తెలిపారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, శాంతియుత ఎన్నికల నిర్వహణే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐలు రమేష్, అనూష, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి.. కారింగుల నర్సింగరావు

**● స్ఫూర్తి ప్రదాత... గ్రామ వ్యవస్థాపక విధాత**
**● కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్**



**జవహర్ నగర్,ఫిబ్రవరి 03: (వార్తా ప్రభ)**బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్ఫూర్తి ప్రదాత, గ్రామ వ్యవస్థాపక విధాత, మన కారింగుల నర్సింగ్ రావు గౌడేనని జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజాసేవకే తన జీవితం అంకితం చేసిన మహోన్నతమైన వ్యక్తి జవహర్ నగర్ వ్యవస్థపకులు మాజీ సర్పంచ్ నర్సింగ్ రావ్ గౌడ్ వర్ధంతి సందర్భంగా మంగళవారం నర్సింగ్రావుగౌడ్ 27వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నర్సింగ్ రావ్ గౌడ్ ఎంతో కృషి చేశారని, ప్రజా సేవకే తన జీవితం అంకితం చేశాడని కొనియాడారు. పేదలకు నిలయమైన జవహర్ నగర్ గ్రామానికి రూపురేఖలు తీసుకొచ్చి ప్రత్యేకమైన మున్సిపల్ కార్పొరేషన్ గా ఎదిగిన తీరు తదనంతరం గ్రేటర్ లో కలిసిన విధానం వెరసి జవహర్ నగర్ రూపు రేఖలు మార్చిన ఘనత కారింగుల నర్సింగ్ రావుకే చెందుతుందని తెలిపారు. జనం కోసమే జీవించిన నాయకుడు జనం కోసమే మరణించిన ధీరుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ వేణు, నాయకులు బూడిద వెంకటేష్, రమేష్ చారి దయాకర్ చారి, నందుగౌడ్, సాయికృష్ణ, రాజుయాదవ్, శంకర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రఘునందన్ రావు టెస్కో అభివృద్ధికి కీలక పాత్ర వహించారు.

**ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్**






**హైదరాబాద్ : ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పదవి విరమణ చేయవలసిందేనని అంతమాత్రాన నిరుత్సాహ పడవద్దని, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని తెలంగాణ రాష్ట్ర చేనేత జౌళి ,ఎండోమెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ, హ్యాండ్లూమ్స్ కమిషనర్, టెస్కో వైస్ చైర్మన్ ఎండి శైలజ రామయ్యార్ అన్నారు. పదవి విరమణ చేసిన ఇంకా జీవితం ఎంతో ఉందని ఆ సమయాన్ని సమాజ సేవ కోసం వినియోగిస్తే ఎంతో సంతృప్తిగా ఉంటుందని అన్నారు తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం లిమిటెడ్ టెస్కోలో జనరల్ మేనేజర్ ఫైనాన్స్ మేనేజర్ అడ్మిన్ గా సుదీర్ఘకాలం పనిచేసిన ఎం రఘునందన్ రావు ఉద్యోగులందరి అభిమానాన్ని పొందారని ముఖ్య అతిథిగా పాల్గొన్న శైలజ రామయ్యార్ అభినందించారు. గత ఎనిమిది సంవత్సరాలుగా టెస్కో సంస్థను అభివృద్ధి చేయడంలో రఘునందన్ పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. రాష్ట్ర విభజన అనంతరం ఆప్కో నుండి టెస్కో సంస్థగా ఆవిర్భవించిన తరుణంలో ఎదురైన అనేక సవాళ్లను ఎదుర్కొంటు సంస్థ అభివృద్ధికి కీలకపాత్ర పోషించారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో చేనేతజౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ లు ఎం వెంకటేశ్వరరావు ,ఇందుమతి, డిప్యూటీ డైరెక్టర్ నాగలత, టెస్కో మార్కెటింగ్ ఓఎస్డి రతన్ కుమార్ , టెస్కో ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ సుధాకర్ రెడ్డి ,వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ హైదరాబాద్ హిమజా కుమార్ ,అసిస్టెంట్ డైరెక్టర్లు సందీప్ జోషి ,నంద చారి, టెస్కో టెలివిజన్ మార్కెటింగ్ అధికారులు కళింగారెడ్డి ,వెంకటేశ్వర్లు, జనార్ధన్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా టెస్కో సంస్థ తదుపరి ఫైనాన్స్ జనరల్ మేనేజర్ కళింగ రెడ్డి అడ్మిన్ జనరల్ మేనేజర్ గా మాధవి లకు పూర్తి అదనపు బాధ్యతలతో శైలజ రామయ్య నియమించారు.

# రాంగ్ సైడ్ వాహనాలపై ప్రత్యేక తనిఖీలు, నిఘా



**మియాపూర్,ఫిబ్రవరి 3 (వార్తా ప్రభ):**మియాపూర్ ఆల్విన్ ఎక్స్ రోడ్ వద్ద మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు బుధవారం తప్పుదారి (రాంగ్ సైడ్) వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్,ఎస్ఐపి హరి శంకర్,ఎస్ఐపి విట్టల్ రెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ తనిఖీల్లో 7 ద్విచక్రాలు,6 ఆటోలు కలిపి మొత్తం 13 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వాహనదారులపై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగించేలా తప్పుదారిలో వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ హెచ్చరించారు. రోడ్డు భద్రతకు సహకరించాలని ప్రజలకు సూచించారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

# ప్రజలు దోమలతో ఇబ్బంది పడకుండా ఫాగింగ్

**సొంత ఖర్చుతో ఫాగింగ్ చేపట్టిన కాంగ్రెస్ నేత మిర్యాల ప్రీతం**






**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ)**:చందానగర్ డివిజన్ పరిధిలోని శంకర్‌నగర్, న్యూ శంకర్‌నగర్, ఎన్‌బీఆర్ ఎన్‌క్లేవ్, భవానీపురం ప్రాంతాల్లో దోమల సమస్య తీవ్రతరం కావడంతో దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకుడు మిర్యాల ప్రీతం తన సొంత నిధులతో చేపట్టడం విశేషం. దోమల వ్యాప్తి కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ చర్యలు చేపట్టామని తెలిపారు. ఫాగింగ్ కార్యక్రమం వల్ల దోమల సమస్య తగ్గుతుందనే ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేస్తూ, ప్రజారోగ్య పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దొరబాబు, పార్వత్ రెడ్డి, రఘు, శ్రీనివాస్ రెడ్డి, నరేష్, శివ, సాయిబాబా చందు తదితరులతో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈద్గా సామాజిక సమానత్వానికి ప్రతీక

**కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ)**:శేరిలింగంపల్లి డివిజన్ బాపునగర్‌లోని ఈద్గా ను ముస్లిం మత పెద్దల ఆహ్వానం మేరకు కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పరిశీలించారు ఈద్గా సామాజిక సమానత్వానికి ప్రతీక అని, కుల--మత భేదాలు లేకుండా ప్రజలను ఏకం చేసే పవిత్ర స్థలమని ఆయన అన్నారు. ఈద్గా పరిరక్షణ అందరి బాధ్యత అని,సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఫ్లోరింగ్ స్థానంలో సీసీ ఫ్లోరింగ్ వేయిస్తామని హామీ ఇచ్చారు. రంజాన్ సందర్భంగా ఈద్గా, కబురుస్తాన్‌ల పరిశుభ్రత కోసం జిహెచ్ఎంసితో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మౌలిక సదుపాయాల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం సోదరులు పాల్గొన్నారు

# చైన్ స్నాచింగ్ కు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 3 (వార్తాప్రభ)**:వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని పట్టపగలు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితుడిని చందానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సైబరాబాద్ ఎస్ఓటీ,సీసీఎస్ బృందాల సహకారంతో కేసును ఛేదించినట్లు శేరిలింగంపల్లి ఏసీపీ సిహెచ్ వై.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఈ నెల 31న బీహెచ్ఈఎల్ ఓల్డ్ ఎంఐజీ కాలనీ రామాలయం టెంపుల్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న 72, 73 ఏళ్ల వృద్ధ మహిళల మెడలోని బంగారు గొలుసులను నిందితుడు లాక్కొని పరారయ్యాడు. సాంకేతిక ఆధారాలతో రంగారెడ్డి జిల్లా లింగంపల్లి గోపినగర్‌కు చెందిన డి. రాజేష్ (32)గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అతి తక్కువ సమయంలో కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# భక్తిశ్రద్ధలతో షబే- ఇ- బరాత్ ప్రార్థనలు





**మల్కాజిగిరి :ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)** షబే -ఇ- బరాత్ పర్వదినాన్ని పురస్కరించుకొని మల్కాజ్ గిరి జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ముస్లిం సోదరులు మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గౌతమ్ నగర్ మల్కాజ్ గిరి, నేరేడ్ మెట్, సైనిక్ పురి ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు మసీదుల్లో ప్రార్థన అనంతరం అమ్ముగూడ ముస్లిం స్మశాన వాటికలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# ఎడిటోరియల్

## జాతీయ స్థాయిలో వైసీపీకి కలిసి వచ్చేది ఎవరు ?

ఏపీలో తిరుపతి లడ్డూ ఇష్యూ ఎంత హీటెడ్ డిస్కషన్ కి దారి తీస్తోందో రాజకీయంగా ఎంతటి ప్రకంపనలు క్రియేట్ చేస్తుందో అంతా చూస్తున్నారు. ఈ ఇష్యూ పర్యవసానాలు కూడా తీవ్రంగానే ఉన్నాయి. మాజీ మంత్రి అంబటి రాంబాబు జైలు పాలు కావడంతో పాటు జోగి రమేష్ మీద దాడితో వైసీపీ డిఫెన్స్ లో పడింది అని అంటున్నారు. దాంతో ఇలాగే కొనసాగితే తాము మరింత ఇబ్బంది పాలు అవుతామని వైసీపీ భావిస్తోంది అంటున్నారు. దాంతో ఈ విషయం మీద జాతీయ స్థాయిలో ఉద్యమానికి సిద్ధం కావాలని ఆలోచిస్తోంది. వైసీపీ ఢిల్లీలో ఒకసారి ఉద్యమించింది. అది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తల్లో. ఇంకా నెలలు కూడా కాకుండానే ఢిల్లీలో జగన్ సహా కీలక నేతలు అంతా వెళ్ళి మరీ ఆందోళనలు చేశారు. ఏపీలో తమ కార్యకర్తల మీద కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని దాడులు చేసి వేధిస్తోందని వైసీపీ ఆనాడు నిరసనలు తెలిపింది. ఈ కార్యక్రమానికి ఎస్పీకి చెందిన అఖిలేష్ యాదవ్, అలాగే ఇతర పార్టీల ఎంపీలు వచ్చారు. కాంగ్రెస్ నుంచి కానీ ఎన్డీయే నుంచి కానీ ఎవరూ హాజరు కాలేదు. ఒక విధంగా ఆ నిరసన టూ ఎర్లీ అయింది అని కూడా అన్నారు.అయితే ఏపీలో కూటమి పాలన ఇరవై నెలలు పూర్తి చేసుకుంది. మరి కొద్ది నెలలలో రెండేళ్ళు పూర్తి అవుతోంది. దాంతో ఇది సరైన సమయం అని వైసీపీ భావిస్తోంది. మాజీ మంత్రుల మీద దాడులు వారి ఇళ్ల మీదకు వెళ్ళడం వంటి వాటిని ఢిల్లీ వేదికగా ఎలుగెత్తి చాటాలని వైసీపీ భావిస్తోందిట. దీని కోసం ఒక యాక్షన్ ప్లాన్ ని రూపొందిస్తోంది అని అంటున్నారు. అయితే జాతీయ స్థాయిలో వైసీపీ ఆందోళన చేస్తే అది సోలోగానే ఉంటుందా లేక ఎవరైనా కలిసి వచ్చే వారు ఉంటారా అన్నది చర్చగా ఉంది. వైసీపీ అయితే ఇప్పటిదాకా ఎన్డీయేలో లేదు, ఇండియా కూటమిలోనూ లేదు, న్యూట్రల్ గా ఉంటోంది. అంతే కాకుండా ఇండియా కూటమి ఆందోళనలకు మద్దతు కూడా ఇచ్చిన సందర్భాలు లేవు, మరి ఇపుడు వైసీపీకి ఇబ్బంది వచ్చిందని ఇండియా కూటమి నేతలు వచ్చి సంఘీభావం తెలియచేస్తారా అన్నది ఒక చర్చగా ఉంది. అదే సమయంలో ఎన్డీయే కూటమి ఎంపీలు ఎటూ ఈ వైపు తొంగి చూసేది లేదు, మరి ఢిల్లీ వేదికగా ఆందోళన చేస్తే ప్లేస్ మారుతుంది కానీ హైప్ క్రియేట్ అవుతుందా అన్నదే చర్చ. అయితే ఇటీవల మమతా బెనర్జీ పుట్టిన రోజు సందర్భంగా జగన్ ఆమెకు గ్రీట్ చేశారు. అలాగే ఎస్పీ అఖిలేష్ యాదవ్ తో మంచి స్నేహం ఉంది అని అంటున్నారు. అలాగే ఆర్జేడీ సహా ఇతర పార్టీల నేతలతో వైసీపీకి కొంత సాన్నిహిత్యం ఉందని అంటున్నారు. ఈ పార్టీలకు చెందిన ఎంపీలను ఆహ్వానించి ఏపీ రాజకీయ పరిణామాలు లా అండ్ ఆర్డర్ మీద ఢిల్లీ వేదికగా బిగ్ సౌండ్ చేస్తే ఆ ప్రభావం గట్టిగా ఉంటుందని వైసీపీ యోచిస్తోందిట. అంతే కాకుండా నేషనల్ మీడియాకు కూడా ఈ సందర్భంగా ఇంటర్వ్యూలు వైసీపీ అధినాయకత్వం ఇవ్వడం ద్వారా ఇష్యూని గట్టిగా చాటాలని అనుకుంటున్నారుట. మరి వైసీపీ ఢిల్లీ యాత్ర పార్లమెంట్ బడ్జెట్ సెషన్ సందర్భంగా ఉంటుందా ఉంటే డేట్ టైం ఎపుడు అన్నదే ఆసక్తికరంగా ఉంది.

## కార్నియల్ డొనేషన్ సెంటర్ ను ప్రారంభించిన జిల్లా వైద్య శాఖ అధికారి.



మచిలీపట్నం ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి) ప్రభుత్వ సర్వజన వైద్యశాల మచిలీపట్నం నందు కృష్ణా జిల్లాలో మొట్టమొదటిసారిగా కార్నియల్ డొనేషన్ సెంటర్ ను ప్రారంభించారు. జాతీయ అంతత్వ నివారణ సంస్థ లో భాగంగా కృష్ణాజిల్లా వ్యాప్తంగా నేత్రదాన శిబిరాలు దానం చేసిన నేత్రాలను నిలువ చేయడానికి సంబంధించిన ఐ డొనేషన్ సెంటర్ ను మంగళవారం జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ యుగంధర్ పీవీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ టిటికే రెడ్డి , సర్వజన వైద్యశాల పర్యవేక్షణ అధికారిని డాక్టర్ ఆశలత సంయుక్తంగా ప్రారంభించారు. మొదట ఐ డొనేషన్ సెంటర్ ప్రారంభించిన తర్వాత నేత్ర నిధిని ఆ తర్వాత కార్నియల్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేయడానికి తగిన శాస్త్ర చికిత్స పరికరాలు అందుబాటులో రానున్నాయని జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ జి భానుమూర్తి తెలిపారు. అనంతరం జరిగిన అవగాహన సదస్సులో నేత్రదానము దాని ఆవశ్యకత తదితర విషయాల గురించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యుగంధర్, డాక్టర్ ఆశలత ,డాక్టర్ నిరంజన్ , డాక్టర్ శేషు కుమార్, డాక్టర్ శ్రీనివాస్ , డాక్టర్ లీలా ప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా అగర్వాల్ ఐ హాస్పిటల్ మేనేజర్ రాజీవ్ మాట్లాడుతూ కృష్ణాజిల్లాలో ఉన్న స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని వచ్చిన రోటరీ క్లబ్ స్ఫూర్తి ఫౌండేషన్ కొల్లు ఫౌండేషన్ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కృష్ణాజిల్లా లో ప్రభుత్వ సర్వజన వైద్యశాల, అగర్వాల్ ఆసుపత్రికి సంబంధించిన సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉన్నారు. ఎవరైతే చనిపోయిన తర్వాత నేతరాలను దానం చేయాలనుకుంటున్నారో వారు చనిపోయిన నాలుగు గంటల లోపల నేత్ర నిధిని సంప్రదించిన వెంటనే టెక్నిషన్స్ వచ్చి నేత్రాలను సేకరించి భద్రపరుస్తామని జిల్లా అంతత్వ నివారణాధికారి భానుమూర్తి తెలిపారు

## పెరటి కోళ్లతో పోషకాహార భద్రత

**పెరటి కోళ్ల పంపిణీ లో పాల్గొన్న టిడిపి నాయకులు**



చేజర్ల ఫిబ్రవరి 03 (వార్తప్రభ) గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు స్వయం ఉపాధి పొంది పోషకాహార భద్రతను సాధించుకోనేందుకోసం పెరటికోళ్ళు పంపిణీ చేయడం జరిగిందని సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవ చౌదరి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన చేజర్లలో డిఆర్డిఏ వెలుగు కార్యాలయం ద్వారా వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ముఖంలో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు లక్ష్యం అని అన్నారు. మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి పదంలో పయనిస్తుందన్నారు. ఏపిఎం ద్వారా మండలం లో 100 యూనిట్లు కోళ్లను పంపిణి చేశారు ఒక్కో యూనిట్ ఖరీదు ?3300 అని యూనిట్ కి 11 కోళు వంతున పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా ఎంపీపీ తూమాటి భాస్కర్ రెడ్డి టీడీపీ సీనియర్ నాయకులు రావి లక్ష్మి నర్సారెడ్డి వావిలేరు సర్పంచ్ రాంబాబు అదూరుపల్లి టీడీపీ నాయకులు ఏటూరు రామానాయుడు వెటర్నరీ డాక్టర్ రాజేష్ ఏపిఎం సుజన సీసీ లు ఎంఎస్ఎ విఓఎ లు మహిళలు హాజరైనారు.

## అత్యంత వైభవంగా సాగుతున్న ఎనిమిదవ రోజు
# “డ్రగ్స్ పై దండయాత్ర” ఉద్యమ సైకిల్ ర్యాలీ







విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు నేతృత్వంలో ఎన్.టి.ఆర్.జిల్లా పరిధి లో 35 రోజులపాటు డ్రగ్స్ రహిత సమాజం కోసం ముందడుగు వేస్తూ డ్రగ్స్ పై దండయాత్ర అనే నినాదం తో 510 కిలోమీటర్ల సైకిల్ యాత్రలో బాగంగా ఎనిమిదవ రోజు కార్యక్రమాన్ని ఎ.డి.సి.పి. గుణ్ణం. రామకృష్ణ పర్యవేక్షణలో నార్త్ ఎ.సి.పి. డా. స్రవంతి రాయ్ , సత్యానారాయణపురం ఇన్స్పెక్టర్ శ్రీ లక్ష్మినారాయణ ఆద్వర్యంలో మంగళవారం ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం వినూత్నంగా డ్రగ్స్ వద్దు యోగా ముద్దు అనే నినాధంతో బ్రహ్మ కుమారీస్ నుండి బి.కే.పద్మజా , బి.కే.రాధ ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలో 400 మందితో ప్రాణాయామం అనంతరం యోగా ట్రైనర్ నిహారిక తో చిన్న చిన్న ఆసనాలతో యోగా నిర్వహించడం జరిగింది. అనంతరం ఈ ఉద్యమాన్ని వ్యూహాత్మకంగా ముందుకు తీసుకెళ్లేందుకు నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు , ఈగల్ ఐ.జి. ఆకే రవి కృష్ణ , సెంట్రల్ ఎం.ఎల్.ఎ. బోండా ఉమా మహేశ్వర రావు , అడ్మిన్ డి.సి.పి శ్రీమతి కే.జి.వి సరిత, డా. సమరం , ఇతర ఉన్నతాధికారులు జరిగిన సమావేశానికి హాజరై స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైడ్ పోలీసు అధికారులు సంఘం వారు, రెడ్ క్రాస్ సొసైటీ వారు, ఇతర స్వచ్ఛంద సంస్థలు, ఆటో యూనియన్స్ వారు, ట్రాన్స్ జాండర్ వారు, శారదా కళాశాల, విజయ నర్సింగ్ కళాశాల, రవీంద్ర భారతి, ప్రభుత్వ పాఠశాల విధ్యార్థినీ విధ్యార్థులు మొదలైన వారు సుమారు 3000 మంది పెద్ద సంఖ్యలో పాల్గొని బి.ఆర్.టి.ఎస్. రోడ్డులో ర్యాలీని నిర్వహించారు. ఉద్యమ సైకిల్ యాత్రలో నగర పోలీసు కమిషనర్ మాట్లాడుతూ..... విజయవాడ అంటే ఈ రోజు గుర్తుకు వచ్చేది రౌడీజం కాదు, ఈ రోజు గుర్తుకు వచ్చేది టెక్నాలజీ లెవెల్ పోలిసింగ్, నగరంలో 50 డ్రోన్ల పర్యవేక్షణ , సుమారు 12000 కెమెరాలతో కమ్యునిటీ ఏర్పాటు చేసుకుని విజయవాడ ప్రజలను కంటికి రెప్పలాగా కాపాడుతున్నాయి, న్యాట్ గ్రిడ్ అనే ఒక డేటా బేస్ ను ఉపయోగించుకుని దొంగలను పట్టుకోవడం జరుగుతుంది. విజయవాడ అంటే గర్వంగా చెప్పుకునే విధంగా పోలిసింగ్ నడుపుతున్నాము..ఇదే సందర్భంలో డ్రగ్స్ మీద కూడా ఒక దండయాత్ర అనే కార్యక్రమం చేపట్టి మూల మూలాల్లోనుంచి తొలగించాలనే సదుద్దేశంతో ఈ రోజు ఈ భారీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రాజాపత్రినిదుల నుండి ప్రజల నుండి వెల్లువెత్తున ప్రశంశలు లభిస్తున్నాయి అని తెలియజేశారు. ఇది కేవలం కార్యక్రమం కాదు దిశా నిర్దేశం ఉన్న ఉద్యమం. ఈ రోజు సందేశం స్పష్టం యువతను రక్షించాలంటే అవగాహననే ఆయుధంగా ఉపయోగించాలి. పోలీస్ అధికారులు కేవలం మాట్లాడలేదు, ప్రజల మధ్య నిలబడ్డారు. డ్రగ్స్ అనే ప్రమాదం ఎక్కడ మొదలవుతుందో అక్కడికే వెళ్లి అప్రమత్తం చేశారు.

# మొబైల్ కల్చర్ ను తగ్గించాలంటే బుక్ రీడింగ్ ఒక్కటే మార్గం

● విద్యాలయాల్లోనూ బుక్ రీడింగ్ ఒక సెషన్ ఏర్పాటు చేస్తాం ● మార్కుల కోసం పాఠ్యాంశ పుస్తకాలు చదివినా విజ్ఞానం కోసం ఇతర విలువైన గ్రంథాలు చదవాలి ● పిల్లల్ని గ్రంథాలయాలకు చేరువ చేసే ప్రయత్నాలు వేగవంతం కావాలి. ● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీ శ





విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)వారానికి ఒక్కరోజు విద్యాసంస్థలన్నింటిలోనూ ఒక సెషన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు బుక్ రీడింగ్ అలవాటు చేసేలా ఉ పాధ్యాయులందర్నీ మోటివేట్ చేస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. ‘మరో గ్రంథాలయ ఉద్యమం’ చేపట్టిన హైదరాబాద్ నుండి అమరావతికి పుస్తకంతో బస్సుయాత్ర విజయవాడ మజిలీలో భాగంగా మంగళవారం ఉదయం 11 గంటలకు విజయవాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంది. ఆ బస్సుయాత్రకు కలెక్టర్ లక్ష్మీశ స్వాగతం పలికారు. బస్సుయాత్ర చేస్తున్న పుస్తక ప్రేమికుల్ని, రచయితల్ని, ఉద్యమకారుల్ని ఆత్మీయంగా పలకరించారు. బస్సుయాత్ర విశేషాలను ఉద్యమ సారథి మంచికంటిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ– విద్యార్థుల్లో పెరిగిపోయిన మొబైల్ కల్చర్ ను తగ్గించాలంటే బుక్ రీడింగ్ ఒక్కటే మార్గమన్నారు. మొబైల్ నిర్మాణ టెక్నాలజీ కూడా పుస్తకం చదవడం ద్వారానే వచ్చిందన్నారు. పిల్లల తల్లిదండ్రులు కూడా పిల్లల్లో పుస్తకాలు చదివే అలవాటు బాగా పెంచాలన్నారు. వాళ్ళను గ్రంథాలయాలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం వుందన్నారు. ఆ దిశగా ఉద్యమిస్తున్న మరో గ్రంథాలయ ఉద్యమ నాయకులందర్నీ అభినందించారు. ఈ ఉద్యమ స్ఫూర్తితో ఎన్టీఆర్ జిల్లాలోనూ విద్యాలయాల్లో వారానికి ఒక్కరోజు పాఠ్యాంశేతర పుస్తకాలను చదివే విధంగా ఒక సెషన్ ఏర్పాటు చేసేలా ఉపాధ్యాయుల్ని మోటివేట్ చేస్తామన్నారు. అవకాశమున్న పార్కుల్లో మినీ మొబైల్ గ్రంథాలయాల ఏర్పాటు గురించి పరిశీలించి నిర్ణయం తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా ‘జయహో పుస్తకం’ పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నవమల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ,సీనియర్ జర్నలిస్టు యేమినేని వెంకటరమణ సారథ్యం వహించారు. కార్యక్రమంలో మంచికంటి, బండారు విజయ, కాసుల రవికుమార్, సిఏ ప్రసాద్ కాంతి నల్లూరి, పైడిమర్రి విజయ, కందుకూరు రాము, కస్తూరి ప్రభాకర్, కాసుల శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా...?

● రాష్టానికి హోంమంత్రి ఉన్నారా...?● శాంతిభద్రతలు గాడి తప్పడం ప్రభుత్వ వైఫల్యం
● మాజీ హోం మంత్రి తానేటి వనిత



ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 03(వార్తా ప్రభ ప్రతినిధి): రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అనేది ఉందా? అని రాష్ట్రానికి హోం మంత్రి ఉన్నారా ? కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు మాజీ హోమ్ మినిస్టర్ తానేటి వనిత. ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి రమేష్ ను ఆమె మంగళవారం పరామర్శించారు. దాడి జరిగిన తీరును యోగి రమేష్ ను అడిగి తెలుసుకున్నారు. కంట్రోల్ చేయలేక అధైర్య పడవద్దని అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటదని జోగికి భరోసా ఇచ్చారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ పోలీసులు దాడి అడ్డుకోవడం పోయి సహకరించడం దారుణమని అన్నారు. జోగి కుటుంబం పై దాడి అమానుష చర్య అని, రాష్ట్రంలో యుద్ధాలు జరుగుతున్నాయా అన్న అనుమానం కలిగేలా ఉన్నాయి రాష్ట్ర లో సంఘటనలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఇళ్లమీద దాడి చేసి వైఎస్ఆర్సిపి ఆస్తులు చేస్తూ విధ్వంసకర పాలన చేస్తున్నారని,పక్క ప్లాన్ తోనే టిడిపి కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని అన్నారు. నిరూపణ లేని కేసుల్లో మూడు నెలలు జైల్లో పెట్టిన ఇంకా ప్రభుత్వానికి సంతృప్తి లేదు అందుకే ఇళ్లమీద దాడి చేశారని తెలిపారు.

# అసిస్టెంట్ కలెక్టర్ పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాస్.

**గ్రూప్ 1 ఉద్యోగం సాధించిన సాయి ప్రవల్లికకు సత్కారం.**
**పదవ తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివితే విజయాల సునాయాసం.... అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్**
**విద్యార్థి దశలో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి....**
**డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం సాధించిన సాయి ప్రవల్లిక.**



మచిలీపట్నం ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)పదవ తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివితే సునాయాసంగా విజయాలు సాధించవచ్చని అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చిలకలపూడి మున్సిపల్ హై స్కూల్ పదవ తరగతి విద్యార్థులకు విజయీభవ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ టీచర్ గా మారి తెల్లబల్లపై రాస్తూ విద్యార్థులను ప్రశ్నలు అడుగుతూ మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు పరీక్షల ముందు రెండు నెలల కీలకమన్నారు. మచిలీపట్నం హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివసిస్తున్న సాయి ప్రవల్లిక డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగ సాధించిన నేపథ్యంలో ఆమెను సత్కరించారు ఈ సందర్భంగా ప్రవల్లిక తాను విజయాలు ఎలా సాధించారో విద్యార్థులకు వివరించారు. తన సక్సెస్ కు కారణం సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఏకాగ్రతతో చదువుకోవడమే అన్నారు. పదవ తరగతి నుంచి విద్యార్థులు ఒక్క ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలన్నారు. మోటివేటర్ స్టార్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆదిత్య మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థి జీవితంలో ఒక మలుపు అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ ఉపాధ్యక్షులు బొమ్మిడి స్వామి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మానవతా జిల్లా కో– కన్వీనర్ ముదిగొండ శాస్త్రి ప్రధానోపాధ్యాయులు జి వెంకటేశ్వరరావు, సహ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, తదితరులు మాట్లాడారు ఈ సందర్భంగా ప్రతిభ పాటవ పోటీలలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులకు మెడల్స్ ప్రశంస పత్రాలు అందజేశారు.

## 5వ రాజ్యాంగ నిర్మాణం- పీఠిక- ముఖ్యాంశాలు పుస్తకావిష్కరణ సభ

గుంటూరు టౌన్ ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)రాజ్యాంగ చర్చావేదిక ఆధ్వర్యంలో 5వ తేదీ గురువారం మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ .లక్ష్మణరావు రచించిన భారత రాజ్యాంగ నిర్మాణం– రాజ్యాంగ పీఠిక ,భారత రాజ్యాంగం –ముఖ్యాంశాలు పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహిస్తున్నట్లు రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్ష, కార్యదర్శులు నడింపల్లి గురుదత్, అవధానులహరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. .2/1 బ్రాడీపేటలో ని బాలానంద కేంద్రం మీటింగ్ హాల్లో గురువారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించే ఈ పుస్తకావిష్కరణ సభలో ప్రొఫెసర్ డి ఏ ఆర్ సుబ్రహ్మణ్యం, రాజ్యాంగ నిర్మాణం – పీఠిక పుస్తకాన్ని, హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు రాజ్యాంగం– ముఖ్యాంశాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. నగర పౌరులు, న్యాయవాదులు అధిక సంఖ్యలో ఈ పుస్తకావిష్కరణ సభకు హాజరు కావాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

## కృష్ణా వర్సిటీ మహిళా చెస్ చాంపియన్ కేబీఎన్ కళాశాల




విజయవాడ పశ్చిమ, ఫిబ్రవరి 3: (వార్తా ప్రభ ప్రతినిధి)కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల మహిళా చెస్ పోటీలలో తమ కళాశాల విద్యార్థినులు చక్కని ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయ చెస్ ఛాంపియన్లుగా నిలిచారని కె.బి.ఎన్. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి తెలిపారు. ఇటీవల (జనవరి 31) గుడివాడ ఎ.ఎన్.ఆర్ కాలేజీలో జరిగిన పోటీల్లో తమ విద్యార్థినులు జె. సాయి హర్షిత, జి. రాజరాజేశ్వరి, కె. పూర్విత అంజన రామచంద్ర, కె. హేమ విజేతలుగా నిలిచినట్లు చెప్పారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి. శ్రీనివాసు, హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు, వ్యాయామ విభాగాధిపతి డి. హేమచంద్రరావు, చెస్ కోచ్ పి.జ్యోతి కిరణ్ విద్యార్థులను అభినందించారు.

## శాఖలన్ని సమన్వయంతో పని చేయాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**




విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)శాఖలన్ని సమన్వయంతో పని చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం శాఖాధిపతులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలి కాన్ఫరెన్స్లో పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించరాదని, ప్రజలకు దోమల వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తకుండా యాంటీ లార్వే ఆపరేషన్లు నిర్వహిస్తుండాలని, సైడ్ కాలువలో పూడికలను ఎప్పటికప్పుడు తీసేయాలని, ప్రతిరోజు ప్రజల ఇంటి వద్ద త్రాగునీటి పరీక్షలు నిర్వహించాలని, శాఖలన్ని సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్న వెంటనే పరిష్కరించాలని, జరుగుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అన్నారు.

## అంకమ్మ అమ్మ వారికి ఉదయ పొంగళ్ళు సమర్పణ



పెనుగంచిప్రోలు,ఫిబ్రవరి 3( వార్త ప్రభ) శ్రీ తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల మహోత్సవాలల్లో భాగంగా మూడవ రోజుమంగళవారం ఉదయ పొంగళ్ళు సమర్పించారు, కార్యక్రమం ఘనంగా ప్రారంభం అయినది. గ్రామానికి చెందిన శాలివాహనులు పెద్ద మట్టి కుండను తీసుకు వచ్చి అమ్మ వారి ఆలయం లోని అన్న ప్రసాదం వద్ద పొంగళ్ళ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొమ్ము వాయిధ్యా కారులు, బై నీడు వారు, ఓగ్గు కతలతో అమ్మ వారి ఉదయ పొంగళ్ళు అంకసేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన్నారు. ఆలయ చైర్మన్ చుంచు రమేష్ బాబు. ఏ ఈ ఓ జంగం శ్రీనివాసరరావు, ఈ ఈ రమా. ఆలయ ప్రధాన అర్చకులు మర్రే బోయిన గోపి బాబు. ఆలయ పురోహితులు శివారంబోట్ల ఆంజనేయ శర్మ. ఆలయ సూపర్ డెంట్. రాజు. బత్తుల కృష్ణ. శశి కాపుర్. జలబిందెలు తీసుకు వచ్చే, సూరం పల్లి, నల్లపు నేని. వడ్లమూడి, కర్ల.. గజ్జి.. వంశీయులు పెద్ద సంఖ్యలో భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, వేద పండితులు అర్చకులు పాల్గొన్నారు..

## యువకుడు దారుణ హత్య...

రొద్దం:ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి) శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలంలోని పెదకోడిపల్లి గ్రామ శివారులో మంగళవారం ఒక యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం, లింగమయ్య అనే యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి చంపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పెనుకొండ సీఐ కె. రాఘవన్ విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లోకేష్ ల పై 2 టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన మాజీ మంత్రి వెలంపల్లి

● కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ● దేవదేవుడి ప్రసాదాన్ని కించపరిచిన వారి పై క్రిమినల్ కేసులు కట్టాలి ● కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిని అవమానించిన వ్యక్తి చంద్రబాబు ● చంద్రబాబు పవన్ కళ్యాణ్ లోకేష్ లు హిందువుల ద్రోహులు ● ఇసుక, రేషన్, మద్యం, మట్టి దోపిడీ చేసే వ్యక్తి కేశినేని చిన్ని ● మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ధ్వజం





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తిరుపతి ప్రసాదాన్ని కించపరిచే విధంగా,అవమానించే విధంగా పదే పదే మాట్లాడుతున్నా చంద్రబాబు,పవన్ కళ్యాణ్, నారా లోకేష్ లపై కేసులు కట్టాలని కోరుతూ రాష్ట్రా వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు మాజీ దేవాదాయ శాఖ మంత్రి పశ్చిమ నియోజకవర్గం వైకాపా ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు బెజవాడ 2 టౌన్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ చిన్నకొండలరావుకి మంగళవారం నియోజకవర్గ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ...... విజయవాడ పశ్చిమ నియోజకవర్గం తరపున ఏదైతే పవిత్రమైన ఆ దేవదేవుడి ప్రసాదం లడ్డులో పందికొవ్వు, యానిమల్ ఫ్యాట్,చేప నూనె కలిసింది అని చెప్పి పదే పదే,సుమారుగా ఒక సంవత్సర కాలం నుంచి,గత సంవత్సరం సెప్టెంబర్ 18వ తారీకు నుంచి ఇప్పటి వరకు కూడా చంద్రబాబు నాయుడు,పవన్ కళ్యాణ్,నారా లోకేష్ ముగ్గురు కూడా తిరుపతి ప్రసాదాన్ని కించపరిచే విధంగా, అవమానించే విధంగా పదే పదే మాట్లాడుతున్నారన్నారు.వారిపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశామన్నారు.మొన్న సిట్ నివేదికలో ఏదైతే నేషనల్ ల్యాబ్స్ నుంచి ఒకటి హర్యానా నుంచి,ఒకటి గుజరాత్ నుంచి – రెండు ల్యాబ్స్ నుంచి కూడా రిపోర్ట్ వచ్చింది.దాంట్లో ఎక్కడా కూడా యానిమల్ ఫ్యాట్ లేదు అనేది ధ్రువీకరించారన్నారు.అయినా గానీ ఈ కూటమి ప్రభుత్వం వెంకటేశ్వర స్వామి మీద భక్తి ఉంటే ఈ పనులు చేయరు వాళ్ళు అని తెలిపారు.ఎందుకంటే ఈ ప్రభుత్వం వచ్చాకే ఆ నెయ్యి శాంపిల్ తీయడం జరిగిందన్నారు.ఈ ప్రభుత్వం వచ్చాకే ఆ నెయ్యి ట్యాంకర్ రావడం,ఈ ప్రభుత్వం వచ్చాకే ఆ ట్యాంకులు పంపించడం,ఈ ప్రభుత్వం వచ్చాకే అంటే ఈ కూటమి ప్రభుత్వం వచ్చాకే మళ్ళీ వాటిని వాడారని కూడా నివేదికలో పొందుపరచడం జరిగిందన్నారు.ఒకవేళ గనుక ఇందులో మీరు అనుకున్న విధంగా కల్తీ ఉంటే,ఆ తప్పు ఈ కూటమి ప్రభుత్వానిదే అని అన్నారు.దేవదేవుడికి అపచారం చేసింది కూటమి ప్రభుత్వమేనని దుయ్య బట్టారు.ఇదంతా కూడా ప్రజలు గమనించాలని కోరారు.గత మూడు రోజుల నుంచి చెప్తున్నాను,ఇది తప్పు, ఎక్కడా కూడా యానిమల్ ఫ్యాట్ కలవలేదని అన్ని ల్యాబ్ రిపోర్ట్స్ ఇచ్చాయి అని చెప్పి.అయినా కానీ చంద్రబాబు నాయుడు,అతను చేసేది తప్పని తెలుసు,దేవుణ్ణి అవమానిస్తున్నాడని తెలుసు, అయినా కానీ పదే పదే దీని మీద మాట్లాడుతూ,ప్రజలు ఏదైతే ల్యాబ్ రిపోర్ట్స్ వచ్చిన తర్వాత ప్రజలందరికీ కూడా నిజం తెలిసిందన్నారు. కానీ అతను చెప్పిన అబద్ధాన్ని నిజం చేయాలనే ఒక దుష్సంకల్పంతో రోడ్డు మీద బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు.మొన్న నిన్న చెప్తున్నట్టు వెంకటేశ్వర స్వామిని రోడ్డు మీదకు లాగుతున్నారన్నారు.అని చెప్పి.రోడ్డు మీద బ్యానర్లు కట్టింది ఎవరండి? రోడ్డు మీద బ్యానర్లు కట్టింది కూటమి ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు.మరి వెంకటేశ్వర స్వామికి అంత అపరాధం చేస్తుంది ఎవరూ? చంద్రబాబు నాయుడు కాదా? అని అన్నారు.వెంకటేశ్వర స్వామిని ప్రపంచ వ్యాప్తంగా కూడా అవమానించిన వ్యక్తి, కించపరిచిన వ్యక్తి, అన్ని విధాలా కూడా అపచారాలు చేస్తున్న వ్యక్తి చంద్రబాబు నాయుడే అని దుయ్యబట్టరు.

**విజయవాడ పార్లమెంట్లో ఇంత దద్దమ్మ ఎంపీని ఎప్పుడు చూడలేదు**

మన విజయవాడ ఎంపీ సూట్ వేసుకొని ఢిల్లీలో మాట్లాడుతున్నాడు.సూట్ వేసుకున్నంత మాత్రాన అతను సూట్ వేసుకున్న మనిషి కాదన్నారు.ఎంపీ మన కేశినేని చిన్ని,నాకు తెలిసి విజయవాడ పార్లమెంట్లో ఇంత దద్దమ్మ ఎంపీని ఎక్కడా చూడలేదన్నారు. మనం ఎక్కడా కూడా ఇంత దద్దమ్మ ఎంపీ ని చూడలేదు ఎందుకంటే ప్రతి దాంట్లో దోపిడీయే.గతంలో మన విజయవాడ పార్లమెంటుకి మంచి మంచి ఎంపీలు చేశారు. వీళ్ళ అన్నయ్య కూడా బాగా చేశాడన్నారు.పదేళ్ళు వాళ్ళ అన్నయ్య తెలుగుదేశం పార్టీ ఎంపీ అయినా కానీ ఎక్కడా కూడా అవినీతి గానీ,ఇటువంటి ఇసుక దోపిడీ గానీ,భూ కబ్జాలు గానీ,ఇటువంటి రౌడీజం గానీ ఎప్పుడూ చేయలేదన్నారు.ఈ ఎంపీ వచ్చాక ఎన్టీఆర్ జిల్లాను భ్రష్టు పట్టించాడన్నారు.చిన్ని మాట్లాడుతాడు నిన్న జోగి రమేష్ మీద దాడి జరిగితే,వాళ్ళ పార్టీ వాళ్లే కావాలని చేయించుకున్నారు అని చెప్పి అన్నారు. మరి ఆ 40 మంది తెలుగుదేశం పార్టీ మీద ఏదో చిన్న కేసు పెద్ద కేసు, ఒక కేసైతే పెట్టారు కదా ఇబ్రహీంపట్నంలో,ఎందుకు పెట్టారు కేసు? వాళ్లకు స్టేషన్ బెయిల్ ఇచ్చేసి రాజమర్యాదలతో కూర్చోబెట్టారు. వాళ్లు మీ పార్టీ వాళ్ళు కాదా అని ప్రశ్నించారు.వాళ్ళందరికీ చక్కగా కాఫీలు, టీలు ఇచ్చి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు.అదే మా పార్టీ వాళ్ళు చేసి ఉంటే... మరి మీ తెలుగుదేశం వాళ్ళ మీద కొంతమంది మీదైనా సరే చిన్న చిన్న కేసులు ఎందుకు పెట్టావయ్యా కేశినేని చిన్ని? అని ప్రశ్నించారు.నీ యొక్క అవినీతి గురించి మేము చెప్పాల్సిన పనిలేదు.మీ తిరువూరు ఎమ్మెల్యే చెప్పాడు ఇసుక దోపిడీ,రేషన్ దోపిడీ,మద్యం దోపిడీ,మట్టి దోపిడీ,ఈ ఎన్టీఆర్ జిల్లాలో వనరులన్నీ కూడా దోచుకుంటున్న వాడు ఎవడన్నా అంటే కేశినేని చిన్ని అన్నమాట అని ఎద్దేవా చేసారు. ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న వనరులన్నీ కూడా దోచుకున్న వ్యక్తి కేశినేని చిన్నినే దాంట్లో ఎటువంటి డౌట్ లేదన్నారు. అతను ఢిల్లీలో కూర్చొని సూట్ వేసుకొని కబుర్లు చెప్తాడన్నారు. వాళ్ళ తెలుగుదేశం వాళ్లే చాలామంది చెప్తున్నారన్నారు. అతను మాకు శ్రీరంగనీతులు చెపితే ఎవ్వరైనా వింటారా అని ప్రశ్నించారు. స్వయానా రక్తపు పంచుకొని పుట్టిన అన్నయ్యే చెప్తాడు నీ భాగోతం అంతా కూడా. నువ్వు జగన్ మోహన్ రెడ్డి గురించి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. నువ్వే ఒక దొంగవి, నువ్వు మళ్ళీ జగన్ మోహన్ రెడ్డి గురించి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడుతున్నావా అని ప్రశ్నించారు. సిగ్గు లేదు నీ మనుషులను పంపించి జోగి రమేష్ మీదకు పంపించి దాడి చేయించడం అని అన్నారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఎప్పుడూ కూడా ఈ సంస్కృతి లేదన్నారు.పెట్రోల్ బాంబులు మీరు ఎప్పుడైనా విన్నారా? ఎప్పుడైనా చూశారా? గతంలో ఎప్పుడో మా చిన్నప్పుడు అనుకునేవాళ్ళం పెట్రోల్ బాంబులని చెప్పి.అటువంటి పెట్రోల్ బాంబులతో జోగి రమేష్ ఇల్లు తగలబెట్టబోయారన్నారు పొరపాటున గనుక అది ఫైర్ అయి ఉంటే దాంట్లో ఉన్న వ్యక్తులంతా కూడా చచ్చిపోతారు కదా? మరి అటువంటి వ్యక్తులకు హత్యా ప్రయత్నం కేసు కట్టాలి కదా? అని ప్రశ్నించారు.చిన్న కేసు నోటీసు ఇచ్చి పంపించేస్తారా అని అన్నారు. అంబటి రాంబాబు ,ఆయన్ని ఎంత ఇబ్బంది పెట్టారంటే ఆయన్ని కర్రలు పట్టుకొని,రాళ్ళు పట్టుకొని ఎనిమిది గంటలు నరకం చూపెట్టారు వాళ్ళ ఇంట్లో.వాళ్ళు అసలు బ్రతికుంటామో చచ్చిపోతామో అని చిన్న పిల్లలతో టెన్షన్ పడే పరిస్థితి లేకపోలేదన్నారు.అందుకే మేము చెప్పింది ఒకటే – ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి పరిపాలించే నైతిక అర్హత లేదన్నారు. రాష్ట్రపతి పాలన విధించండన్నారు. లా అండ్ ఆర్డర్ అనేది పూర్తిగా కూడా ఫెయిల్ అయిపోయిందన్నారు. పోలీసు వ్యవస్థ అంతా కూడా ఆ చంద్రబాబు పెట్టే ఫ్లెక్సీల కాపలా ఉండటం, అదే విధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇళ్ల మీద దాడి చేస్తుంటే వాళ్ళకి కాపలా ఉండటానికే పరిమితమయ్యారన్నారు. దానిలో భాగంగానే నేడు స్టేషన్లో కూడా కంప్లైంట్ ఇవ్వడం జరిగిందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డులో వాడిన నెయ్యిలో పందికొవ్వు ఉందని తప్పుడు ప్రచారం చేసి భక్తుల మనోభావాలు దెబ్బ తీసి, మత విద్వేషాలు రెచ్చగొట్టిన చంద్రబాబు మీద, పవన్ కళ్యాణ్ మీద, నారా లోకేష్ మీద, కూటమి ప్రభుత్వంలో ఎవరైతే మాట్లాడారో ల్యాబ్ రిపోర్టుల ద్వారా నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని తేటతెల్లం కావడంతో దూష్ప్రచారం చేసినవారందరి మీద కేసు కట్టాలని డిమాండ్ చేసారు.

## "నాగమణి ఫ్యాషన్ హౌస్" శుభారంభం.

**ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీ రామ్ రాజగోపాల్ తాతయ్య**



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 3( వార్త ప్రభ )** మండల కేంద్రం అయిన పెనుగంచిప్రోలు గ్రామంలోని పోలీస్ స్టేషన్ సెంటర్లో చెరువు బజార్కు చెందిన చేని నాగమణి "నాగమణి ఫ్యాషన్ హౌస్" కంప్యూటర్ ఎంబ్రాయిడరీ బోటిక్ షాపును ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గజ్జి కృష్ణ మూర్తి, జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా నరసింహారావు, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుదీర్ బాబు, గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి సతీష్ కుమార్, కంభం చిరంజీవి, బాడిశా చిన్న మీరయ్య,పెనుగొండ రామారావు, కొండబాబు,ఏ ఎస్ ఐ నాగేశ్వర రావు,కూటమీ నాయకులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మె ను జయప్రదం చేయండి.

**సిఐటీయు నాయకులు దార నాగేశ్వరరావు**



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 3( వార్త ప్రభ)** పెనుగంచిప్రోలు మండలం లోని మధ్యాహ్నం భోజన ఏజెన్సీ వారు ఈ నెల 12 న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పెనుగంచిప్రోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి. జీ. శ్రీను కు అదే రోజు సెలవు కావాలని వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సి ఐ టీ యు నాయకులు దార నాగేశ్వరరావు మాటడుతూ వారి డిమాండ్లు తెలిపారు. 1లేబర్ కోడ్ రద్దు చేయాలి కార్మిక చట్టాలను పటిష్ట పరచాలి.2 కనీస వేతనం ఇవ్వాలి పర్మిట్ చేయాలి.3 స్కీం వర్కర్ల ను కార్మికులుగా గుర్తించి చట్టబద్దమయినా సౌకర్యాలు కల్పించాలి.4 ఆశ వర్కర్లు నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలి.5 సంక్షేమ పథకాలు అమలు చేయాలి.6 ఆశ వర్కర్లకి 10 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి.7 ఏఎన్ఎం, జి ఎన్ ఎం, శిక్షణ పొందిన ఆశాలకు పర్మినెంట్ పోస్టులు భర్తీ సందర్భంగా ప్రాధాన్యత కల్పించాలి.ఈ కార్యక్రమంలో కె తెరోజమ్మ, కె రాణి. వి.జానకమ్మ, బి. వరలక్ష్మి, టీ. తిరుపతమ్మ. జీ. అరుణా తదితరులు పాల్గొన్నారు...

## నారా లోకేష్ కు స్వాగతం పలికిన ఎంపీ

**హిందూపురం ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మంగళవారం ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా హిందూపురం పార్లమెంటు సభ్యులు బి.కె. పార్థసారథి కుమారుడు సాయి కళ్యాణ్, మంత్రి లోకేష్ కు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. లోకేష్ వారిని ఆప్యాయంగా పలకరించారు.

# రాష్ట్రంలో గొడవలు, దాడులు తప్ప సంక్షేమం శూన్యం

● దాడులు మంచి సంస్కృతి కాదు ● ప్రశ్నించే పవన్ కళ్యాణ్ ఎక్కడా ● టీడీపీ ఎక్స్ ఫైరీ డేట్ 2029 ఫిక్స్ ● వెన్నుపోటు రాజకీయాలు, దాడులు టిడిపికి వెన్నుతో తో పెట్టిన విద్య ● మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ వ్యాఖ్యలు





**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 3 (వార్తా ప్రభ ప్రతినిధి):** రాష్ట్రంలో రాక్షస పాలన, డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలో దాడికి గురైన మాజీ మంత్రి జోగి రమేష్ నివాసాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో గొడవలు, దాడులు తప్ప చెప్పుకోవడానికి చేసిన సంక్షేమం శూన్యమని విమర్శించారు. ప్రశ్నించే పవన్ కళ్యాణ్ దాడులపై ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. నాడు అన్నారో లేదో తెలియదు కానీ రోడ్లమీద తిరిగి కన్నీళ్లు పెట్టుకున్నారని, మరి ఇప్పుడు మహిళలపై దాడులకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఇళ్లల్లో మహిళలు, పిల్లలు ఉంటారని, దాడులు మంచి పద్ధతి, సంస్కృతి కాదన్నారు. ఇలాగే కొనసాగితే అందరూ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. టీడీపీలో ఉన్నవారే బీసీలు, కాపులు కానీ ఇతర పార్టీల్లో ఉన్న వారు కాదా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో మీరన్నట్లు ఫ్యాక్షన్, హింస, రాజారెడ్డి పాలన చేసి ఉంటే టీడీపీ వాళ్లు రోడ్ల మీద తిరిగే వారు కాదన్నారు. పోలీస్ వ్యవస్థ, కేసులు పక్కన పెట్టి రండి.. తేల్చుకుందాం.. ఒక్క రోజులో టీడీపీ, వైసీపీ పరిస్థితి ఏంటో తేలిపోతుంది కానీ ఇది మంచి సంస్కృతి కాదన్నారు. మీ ప్రభుత్వంలో ఎన్ని దాడులు చేస్తారో? ఎన్ని కేసులు పెడతారో పెట్టుకోండి. ఇదేవిధంగా కొనసాగితే, రెచ్చగొడితే వైసీపీ కార్యకర్తలు ధైర్యంగా ముందుకు వస్తారని స్పష్టం చేశారు. ఈ మూడేళ్లు మీకు నచ్చింది చేసుకోండి... మీ ఎక్స్ ఫైరీ డేట్ 2029.. బుద్ధి చెప్పటం ఖాయమన్నారు. రాష్ట్రంలో గంజాయిని పెంచి పోషించి, గంజాయి బ్యాచ్ తో దాడులకు తెగబడుతున్నారని చెప్పారు. వెన్నుపోటు రాజకీయాలు వైసీపీకి తెలియదని, టీడీపీకి వెన్నుపోటు రాజకీయాలు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. వెనక నుంచి దాడులు చేయడం టీడీపీకి అలవాటేనన్నారు. సీఎం స్థాయి వ్యక్తి హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడారన్నారు. తిరుపతి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు లేదని సీబీఐ చెప్పినా తలవంచుకోకుండా భగవంతుడిపై కూడా నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అభివృద్ధే అజెండా - నున్నలో రూ.4.36 కోట్ల పనులకు శ్రీకారం

● రూరల్ గ్రామాల సమస్యలకు వీఎంసీ విలీనమే పరిష్కారం ● తిరుమల లడ్డూ అంశంలో రాజకీయాలు తగదు ● భాషా నియంత్రణ అవసరం... సీఎం పై అనుచిత వ్యాఖ్యలకు అరెస్ట్ సమంజసమే ● ప్రభుత్వ విప్ మరియు గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు

**గన్నవరం, ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గన్నవరం నియోజకవర్గం, విజయవాడ రూరల్ మండలం, నున్న గ్రామంలో రూ.4.36 కోట్లతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఈరోజు ఉదయం శంకుస్థాపన చేశారు. నున్న బైపాస్ రోడ్డు అభివృద్ధికి రూ.2.36 కోట్లు, విజయవాడ--నుజివీడు రోడ్డులో 10 నుంచి 16 కిలోమీటర్ల వరకు రోడ్డు పనులకు రూ.2.70 కోట్లు మంజూరయ్యాయి. విజయవాడ రూరల్లోని 9 గ్రామాలను మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) లో విలీనం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రూరల్ గ్రామాల సమస్యలకు ఇదే శాశ్వత పరిష్కారమన్నారు. తిరుమల లడ్డూ అంశంలో రాజకీయాలు సరికాదని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబు అరెస్ట్ సమంజసమేనని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో భాషా నియంత్రణ అవసరమని స్పష్టం చేశారు.



## ఘనంగా మాజీ సైనికుని అంత్యక్రియలు.

**మచిలీపట్నం ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అనారోగ్య కారణంగా సోమవారం మృతి చెందిన మాజీ సైనికుడు అంత్యక్రియలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాజీ సైనికులు ఆయనకు గౌరవ వందనం చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులు ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. మాజీ సైనికుల అధ్యక్షులు వసంతరావు, విఠల్ ,శరత్ బాబు, రత్న శేఖర్ , నజీర్ మ్యాతేన్,కాజా కడసారిగా చూసుకొని నివాళులర్పించారు.



## హైస్కూల్లో విద్యార్థులకు కళ్ళజోళ్ళు పంపిణీ



**చేజర్ల ఫిబ్రవరి 03 (వార్తప్రభ)** చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చేజెర్ల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల యందు మంగళవారం విద్యార్థులకు కళ్ళజోడు పంపిణీ కార్యక్రమం జరిగినది.ఈ కార్యక్రమములో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీ నరసా రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ వైద్యాధికారి డా.షేక్ మెహతాబ్ మరియు మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ మస్తానయ్య ప్రిన్సిపల్ శ్రావణ్ లెక్చరర్ విజయ్ కుమార్ మరియు స్కూల్ స్టాఫ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## గురుకులం లో 5వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం

**ఆన్లైన్లో దరఖాస్తుల స్వీకరణ.**




**మచిలీపట్నం ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాల యాలు పేద విద్యార్థుల పాలిట ఆశా కిరణాలు. గ్రమీణ ప్రాంతాలలో చదువుకోవడానికి ఆర్థిక స్తోమత, సౌకర్యాలు లేని నిరుపేదలు గురుకు లాల వైపు మొగ్గ చూపుతారు. ఇక్కడ సీటు సాధిస్తే భవిష్యత్తు బంగారంగా మారుతుందని వారి అభిప్రయం . కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నత ప్రమాణాలతో ఇక్కడ విద్యా బోధన అందిస్తుంటారు. విద్యార్థులకు బోధనతో పాటు ఉచితంగా పుస్తకాలు, ఏకరూప దుస్తులు, వసతి, పౌష్టికాహారంతో పాటు అన్ని సౌకర్యా లను ప్రభుత్వం కల్పిస్తుంది. మెరుగైన విద్య, పూర్తిస్థాయి వసతులు ఉండటంతో ఏటా వీటిల్లో ప్రవేశాలకు పోటీ ఉంటుంది.వయసు 5వ తరగతిలో ప్రవే శానికి విద్యార్థులు పద కొండు సంవత్సరాల లోపుండాలి. ఇంటర్మీడి యట్ మొదటి సంవత్సరం ప్రవేశం నాటికి 17 సంవత్సరాలు మించకూడదు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. లక్షకు మించరాదు.అర్హులైన విద్యా ర్థులు ఆన్లైన్లో దర ఖాస్తు చేసుకోవాలి. ఆధార్, పాస్పోర్ట్సైజ్ ఫొటో, విద్యా ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డుకు అను సంధానమైన ఫోన్ నంబరుతో వెబ్సైట్ ఫిబ్రవరి 19వ తేదీలోగా దరఖాస్తు ద్వారా చేసుకోవాలి. వివరా లకు సంబంధిత గురుకుల పాఠశాలల అధ్యాపకులను సంప్ర దించాలి.విద్యార్హతలు 5వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వ, ప్రభుత్వం గుర్తింపు. పొందిన ప్రవేట్ పాఠశాలల్లో 2025–26 విద్యా సంవ త్సరంలో 4వ తరగతి పూర్తి చేసి ఉండాలి. ఇంటర్మీడి యట్ మొదటి సంవత్సరానికి 2025–26 విద్యా సంవ త్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. సీట్ల భర్తీ ఇలా...ఈ ఏడాది (2026–27) విద్యా సంవత్సరానికి 5వ తర గతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో నూతన ప్రవేశా లకు దరఖాస్తులు ఆహ్వానిస్తు అన్నారు. ఫిబ్రవరి 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని అదికారులు చెపుతున్నారు. కొన్నింటిలో 6, 7, 8, 9 తరగ తుల్లో కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయి. అర్హులైన విద్యా ర్థులు ఆ సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లాలోని ప్రతి పాఠశా లలో ఎంపీసీ 40, బైపీసీలో 40 సీట్లు ఉన్నాయి. 5వ తర గతిలో ఒక్కో పాఠశాలలో 80 సీట్లు ఉన్నాయి. మొత్తం 13 ఉన్నాయి అవి కృష్ణ మరియి ఎన్టిఆర్ జిల్లా లో 1. వీరపనేనిగూడెం బాలికలు, 2.పామర్ర బాలురు, 3.రుద్రవరం బాలురు, 4.చల్లపల్లి బాలికలు, 5.బల్లిపర్ర (ఏంఈ సి మరియు సియిసి) బాలికలు, 6.మోటూరు బాలికలు, 7.జగ్గయ్యపేట (ఏంఈ సి మరియు సియిసి) బాలికలు , 8.ముప్పాళ్ళ బాలికలు, 9.కుంటముక్కల బాలికలు, 10.కృష్ణరావుపాలెం బాలురు, 11.తిరువూరు బాలురు, 12.రంగాపురం బాలికలు, 13.నర్సాపురం బాలికల గురు. కులాలున్నాయి.

## తూర్పుపల్లి మాముడూరు లో పొలం పిలుస్తుంది



**చేజర్ల ఫిబ్రవరి 03 (వార్తప్రభ)** మండల పరిధిలోని తూర్పుపల్లి మరియు మాముడూరు గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి పి.ఎస్ హిమబిందు పొలం పిలుస్తుంది కార్యక్రమము నిర్వహించుట జరిగినది.ఈ కార్యక్రమంలో భాగంగా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమం ఉపయోగాలు రైతులకు తెలియజేశారు.తూర్పుపల్లి మాముడూరు లో సాగులోని వరి పంట పొలాలను పరిశీలించి సామూహిక ఎలుకల నివారణకు గాను బ్రోమోడీయేట్ ను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. అదేవిదంగా పంట నమోదు కార్యక్రమం ఆవశ్యకత తెలిపి రైతులు సకాలంలో వ్యవసాయ శాఖ సిబ్బందికి సహకరించి పంట నమోదు చేసుకోవాలి రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది సుజాత విజయ రైతులు పాల్గొన్నారు.

## అన్నదానం కు పలువురు విరాళం..



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 3( వార్త ప్రభ )** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో జరుగు అన్నదానం కుతెలంగాణ లోనిరంగారెడ్డి జిల్లా హైదరాబాద్ రూరల్ కూకట్ పల్లి వాస్తవ్యులు చిలుకూరి వెంకట్రావు విజయలక్ష్మి శ్రీ తిరుపతమ్మ అమ్మవారి నిత్య అన్నదాన పథకములకు 5,116/- రూపాయలు విరాళముగా మరియు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట వాస్తవ్యులు గుండా పూర్ణచంద్రరావు నిత్య అన్నదాన పథకమునకు రూ. 5,1116/- మరియు గోసంరక్షణకు రూ 5,1116/- విరాళముగా ఆలయ ఇన్స్పెక్టర్ పి యల్ నవీన్ కుమార్ కుమంగళవారం అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు.

## గురుకుల ప్రవేశానికి ధరఖాస్తులు ఆహ్వానం

**రెడ్డిగూడెం ఫిబ్రవరి 3(వార్తాప్రభ ప్రతినిధి) :** రెడ్డిగూడెం మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5 వ తరగతి మరియు ఖాళీగా ఉన్న 6,7,8,9 తరగతులు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్ కొరకు ప్రవేశ పరీక్ష నిర్వహించుటకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ తబిత ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 20 వ తేదీనుండి ఆన్లైన్ ధరఖాస్తులు ప్రారంభమయ్యాయనీ ఫిబ్రవరి 19 వ తేదీ ధరఖాస్తులకు ఆఖరి రోజు అని తెలిపారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 5 వ తరగతి ప్రవేశానికి మార్చి 1 వ తేదీ ఉదయం గం,, 9:30 ని,, నుండి 11గంటల వరకు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి అదే తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అలాగే 6,7 తరగతులకు మార్చి 2 వ తేదీన ఉదయం 10 గంటల నుండి 11:30 ని,, వరకు, 8,9 తరగతులకు అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 3:30ని,,ల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. కనుక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## అగ్ని బాధిత కుటుంబానికి లంకిశెట్టి ఫ్రెండ్ సర్కిల్ చేయూత.



**మచిలీపట్నం :ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గూడూరు మండలం, గంజాలవారిపాలెంలో జనవరి 23వ తారీకు సాయంత్రం గ్యాస్ లీకేజ్ తో సర్వస్వం కోల్పోయిన కారు డ్రైవర్ పేరం విజయ్ కుమార్(38) కుటుంబానికి మంగళవారం లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ తరఫున న్యాయవాదులు లంకిశెట్టి బాలాజీ, లంకిశెట్టి సాయి ఫణి సంతోష్ లు చేయూత అందించారు. గంజాల వారిపాలెం చెందిన పేరం విజయ్ కుమార్ తన భార్య ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. జనవరి 23 తారీకు సాయంత్రం ఇంటిలో గ్యాస్ లీకేజ్ కావడంతో ఇల్లు మొత్తం కాలిపోయింది. పిల్లలు పుస్తకాలతో సహా మొత్తం అగ్నికి ఆహుతి అయిపోయింది.రెండు లక్షలకు పైగా నష్టం కలిగింది. కుటుంబ సభ్యులు ప్రాణాలతో బయటపడ్డారు. పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ సూచన మేరకు లంకి శెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ సహాయ కార్యక్రమాన్ని మచిలీపట్నంలో ఏర్పాటు చేసింది. బాధిత కుటుంబానికి నిత్యవసర వస్తువులు, బట్టలు, బియ్యం, వంట సోమాగ్రి,నగదును అందించారు. చలమలశెట్టి చారిటబుల్ చారిటబుల్ ట్రస్ట్ సహాయం అందించిందని మిగిలిన స్వచ్ఛంద సంస్థలు దాతలు కూడా బాదిత కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వ నిధులతో బాధిత కుటుంబానికి పక్కా ఇంటి నిర్మాణం చేసి అందించాలని జిల్లా కలెక్టర్ ను బాలాజీ కోరారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం టూ వీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లా వెంకట సుబ్బారావు పేరం రాజు, కొల్లా వెంకట రాంబాబు, కోమిరిపాలెం శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా 12వ దివ్యాంగ దివ్య దర్శన్ యాత్ర



**హైదరాబాద్ :ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పలమనేరు నియోజకవర్గం నుండి 12వ దివ్యాంగ దివ్య దర్శన్ యాత్ర విజయవంతంగా నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దైవిక ఆశీస్సులతో 12వ దివ్యాంగ దర్శన యాత్ర తిరుమలలో శ్రీ అష్టోత్తర శత (108) చుక్కల ఛారిటబుల్ ట్రస్ట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ నిరంతర సేవా మిషన్లో భాగంగా, ట్రస్ట్ ఇప్పటివరకు మొత్తం 2,929 మంది భక్తులకు శ్రీవారి దర్శనాన్ని ప్రారంభించారు.పలమనేరు నియోజకవర్గం నుండి ఈ 12వ యాత్రలో40 మంది దివ్యాంగ భక్తులు20 మంది అంకితభావంతో కూడిన వాలంటీర్లు9 ట్రస్ట్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) యొక్క నిరంతరాయ మద్దతు సమన్వయంతో, తిరుమల సీనియర్ సిటిజన్ హాల్ ద్వారా వారికి సాఫీగా, గౌరవప్రదమైన, ఆధ్యాత్మికంగా సంతృప్తికరమైన దర్శనం అందించారు. ఈ యాత్రను ఈ ఉదయం పలమనేరులో రిమ్స్ స్పెషల్ స్కూల్ నుండి జెండా ఊపి ప్రారంభించారు. పలమనేరు ఎమ్మెల్యే ఎన్. అమర్ నాథ్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# రామగుండంలో చిట్టీల చిచ్చు!!

● సామాన్యుడి సొమ్ముపై అక్రమార్కుల కన్ను ● లైసెన్స్ లేదు.. నిబంధనలు లేవు ● యథేచ్ఛగా ప్రైవేటు చిట్టీల దందా ● ప్రభుత్వ ఆదాయానికి గండి ● పోలీసుల నిఘా నిల్లేనా ● రామగుండం 'చిట్' రాకెట్ భస్మం కావాలని డిమాండ్




**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 3 వార్తాప్రభ ప్రతినిధి** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ప్రస్తుతం అక్రమ ప్రైవేటు చిట్ ఫండ్స్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ చిట్టీల వ్యాపారం సామాన్య, మధ్యతరగతి ప్రజల రక్త మాంసాలను పిప్పి చేస్తూ వారి శ్రమను దోచుకుంటోంది. ప్రభుత్వ అనుమతులు లేకుండా, రిజిస్ట్రేషన్ల ఊసే ఎత్తకుండా కేవలం కమీషన్ల ఆశ చూపిస్తూ కొందరు నిర్వాహకులు అమాయక ప్రజలను తమ మాయాజాలంలో పడేస్తున్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయం కళ్ళెదుటే ఉన్నా, ఈ అక్రమ వ్యాపారాల తీరుతెన్నులపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం ప్రజలను విస్మయానికి గురి చేస్తోంది. ఒకవైపు ప్రభుత్వం ఆదాయానికి భారీగా గండి కొడుతూ, మరోవైపు చట్టబద్ధత లేని చిట్టీల ద్వారా కోట్లాది రూపాయల టర్నోవర్‌ను రహస్యంగా సాగిస్తున్నారు. అత్యవసర సమయంలో డబ్బు కోసం ఈ చిట్టీలను నమ్ముకున్న కార్మికులు, చిన్న వ్యాపారులు చివరకు నిర్వాహకుల చేతిలో మోసపోయి లబోదిబోమంటున్నారు. కమీషన్ బేస్ట్ పేరుతో అధిక వడ్డీలు వసూలు చేస్తూ, వేలం పాటల్లో మోసాలకు పాల్పడుతూ సామాన్యుడి సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో చిట్టి నిర్వాహకులు బోర్డు తిప్పేసిన ఉదంతాలు వెలుగు చూసినా, ఇక్కడి యంత్రాంగంలో చలనం లేకపోవడం గమనార్హం. అధికారులు తనిఖీలు చేపట్టక పోవడం, కఠిన చర్యలు




తీసుకోకపోవడం వల్ల ఈ మాఫియా మరింత రెచ్చిపోతోంది. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ద్వారా తనిఖీలు నిర్వహించి ఈ అక్రమ చిట్టీల వ్యాపారానికి చరమగీతం పాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. పౌరుల కష్టార్జితానికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉన్న ప్రభుత్వ యంత్రాంగం ఇకనైనా నిద్ర మత్తు వీడి, ఈ దందాపై ఉక్కుపాదం మోపుతుందో లేదో వేచి చూడాలి. పోలీసుల నిఘా వైఫల్యం అలాగే రెవెన్యూ శాఖ ఉదాసీనత వల్ల రామగుండం అక్రమ చిట్టీల అడ్డాగా మారుతోంది. ఈ దందాను అదుపులోకి తీసుకురావడంలో వైఫల్యం కొనసాగితే భవిష్యత్తులో శాంతిభద్రతల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి!!

● కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలపై కార్మిక వర్గం ప్రతిఘటించాలి ● విద్యుత్ సవరణ చట్టం, ఎల్ఐసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలి ● ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి ● ఐఎఫ్టీయూ నాయకులు ఏ. వెంకన్న

**పెద్దపల్లి/ సెంటినరీ కాలనీ: ఫిబ్రవరి 3 (వార్తాప్రభ ప్రతినిధి)** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. వెంకన్న పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్జీ-3 సెక్యూరిటీ విభాగం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ...... కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం-2025, ఎల్ఐసీలో విదేశీ పెట్టుబడుల వంటి ప్రమాదకర నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్మికులను నిరాయుధులను చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని, ఈ అణిచివేత ధోరణిని ప్రతిఘటించడానికి కార్మిక వర్గమంతా ఏకమై



సమ్మెలో పాల్గొనాలని కోరారు. ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో నాయకులు సదానందం, కుమారస్వామి, కొండ సంజీవ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొని కార్మికులను చైతన్యపరిచారు.

# కష్టానికే గుర్తింపు!!

● కాంగ్రెస్ అభ్యర్థిగా కంకణాల మౌనిక ● నాలుగవ డివిజన్‌లో మౌనిక గెలుపు నల్లేరుపై నడకే ● ఎమ్మెల్యే దంపతుల ఆశీస్సులతో భారీ మెజారిటీ దిశగా అడుగులు



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 3 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం నియోజకవర్గ రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తూ, నిరంతరం ప్రజల చెంతనే ఉంటూ సేవలందిస్తున్న కంకణాల మౌనికకు కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించడం ఆమె కష్టానికి దక్కిన గుర్తింపుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీ పట్ల ఆమెకున్న అంకితభావాన్ని, సేవా గుణాన్ని గుర్తించిన అధిష్టానం ఈ నిర్ణయం తీసుకోవడంతో, నాలుగవ డివిజన్‌లో మౌనిక గెలుపు ఇక నల్లేరుపై నడకేనని స్థానిక ప్రజలు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవుతూ ప్రతి సమస్యపై స్పందించే ఆమె పనితీరు మౌనికకు



నియోజకవర్గంలో విశేష ప్రజాదరణను తీసుకువచ్చింది. ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే రాజ్ మనాలి ఠాకూర్ దంపతుల పూర్తి స్థాయి మద్దతు, ఆశీస్సులు ఆమెకు లభించడం ఈ ఎన్నికల బరిలో మౌనికను మరింత శక్తివంతమైన అభ్యర్థిగా నిలబెట్టింది. అభివృద్ధి పథంలో డివిజన్‌ను ముందుకు తీసుకెళ్తారన్న నమ్మకం ఓటర్లలో బలంగా ఉండటంతో, రాబోయే ఎన్నికల్లో ఆమె భారీ మెజారిటీతో విజయం సాధించడం తథ్యమని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ శ్రేణులన్నీ ఏకతాటిపైకి వచ్చి మౌనిక గెలుపు కోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండటంతో డివిజన్‌లో పంజా విసరడం ఖాయంగా కనిపిస్తోంది

# జోన్ పరిధిలో ముమ్మరంగా 'స్పెషల్ శానిటేషన్ డ్రైవ్'

● సుచిత్ర మెయిన్ రోడ్, పైప్‌లైన్ రోడ్లలో క్షేత్రస్థాయి పరిశీలన ● ఐడీపీఎల్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి శుభ్రం చేసిన సిబ్బంది ● పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన జెడ్సీ మరియు డీసీ



**కుత్బుల్లాపూర్/జీడిమెట్ల, ఫిబ్రవరి 3, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని ప్రధాన రహదారుల వెంబడి పారిశుద్ధ్య పనులను మెరుగుపరిచేందుకు అధికారులు 'స్పెషల్ శానిటేషన్ డ్రైవ్'ను ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ సుచిత్ర మెయిన్ రోడ్ మరియు పైప్‌లైన్ రోడ్ల వెంబడి జరుగుతున్న పారిశుద్ధ్య పనులను స్వయంగా




తనిఖీ చేశారు.

**ఫుట్ ఓవర్ బ్రిడ్జి క్లీనింగ్** జీడిమెట్ల సర్కిల్-55 పరిధిలోని ఐడీపీఎల్ ప్రధాన రహదారి వద్ద ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి ని మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఈ సందర్భంగా అధికారులు సిబ్బందికి సూచించారు. ఈ పారిశుద్ధ్య తనిఖీలు మరియు డ్రైవ్‌లో జీడిమెట్ల సర్కిల్-55 డిప్యూటీ కమిషనర్, డీవైఈఈ, శానిటరీ జవాన్ మరియు ఎస్.ఎఫ్.ఏ శివకుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని అధికారులు తెలిపారు

# శ్రీగిరి సుధాకర్ కి టీ.జీ.ఓ.ఎస్. డైరీ, క్యాలెండర్ అందచేసిన నాయకులు ఎం.బి. కృష్ణ యాదవ్



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 3(వార్తాప్రభ):**తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ అధ్యక్షుడు ఎం.బి. కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో కోశాధికారి ఎం.వి. రమణ మరియు సంయుక్త కార్యదర్శి డాక్టర్ క్రొత్త విద్యా సాగర్ చేతుల మీదుగా శ్రీగిరి సుధాకర్ కి టీ.జీ.ఓ.ఎస్ తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ మరియు క్యాలెండర్--2026ను అందజేశారు.ఈ సందర్భంగా సంఘం చేపడుతున్న కార్యక్రమాలు, ఉద్యోగుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంలో మట్టి నమూన సేకరణ



**చేజర్ల ఫిబ్రవరి 03 (వార్తప్రభ)** ప్రకృతి వ్యవసాయంలో మట్టి నమూన సేకరణ కీలకమని మండల వ్యవసాయ అధికారి పి.స్ హిమబిందు తెలిపారు. నేషనల్ మిషన్ ఆన్ న్యాచురల్ ఫార్మింగ్ కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి మండలంలోని పెళ్లేరు పాతపాడు ఏటూరు బిల్లుపాడు తిమ్మయపాలెం గ్రామాల్లో కలిపి 184 మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. తద్వారా మట్టిలోని పోషకాలు యొక్క స్థాయి తెలుసుకోవడానికి జీవ సూక్ష్మజీవుల క్రియాశీలత ప్రకృతి సేద్యం పద్ధతులు మట్టిపై ఎలా ప్రభావం కారణంగా చూపుతున్నాయి. జీవామృతం ఘన జీవామృతాన్ని ఎలా వినియోగించాలో తెలుసుకొనే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎల్.సుజాత ఏపీసీఎన్ఫ్ సిబ్బంది కె.సునీత స్థానిక రైతులు పాల్గొన్నారు.

## రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ



**అనుమసముద్రంపేట ఫిబ్రవరి 03 (వార్తప్రభ)** ఏఎస్ పేట మండలం లోని వేల్పుల గుంట జమ్మవరం గ్రామాలలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు.రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి సూచనలతో రీ సర్వే జరిగిన గ్రామాలలోని రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.మండల తహసిల్దార్ కె అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆత్మకూరు ఆర్డీవో బి పావని రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మండల టిడిపి కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వేల్పుల గుంట గ్రామంలో సుమారు 1600 ఎకరాలకు సంబంధించి 222 పట్టాదారు పాసుపుస్తకాలు జమ్మవరం గ్రామంలోని 302 పట్టాదారు పాస్ పుస్తకాలు ఆర్డిఓ పావని రాష్ట్ర డైరెక్టర్ అబ్బూరి రమేష్ నాయుడు చేతులమీదుగా రైతులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆర్డీవో బి పావని మాట్లాడుతూ రి సర్వే జరిగిన గ్రామాలలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎలాంటి తప్పిదాలు లేకుండా ఇబ్బందులకు గురికాకుండా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ డెవలప్మెంట్ డైరెక్టర్ మండల టిడిపి కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు మాట్లాడుతూ రైతును రాజుగా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.రైతుల ఆస్తులకు పూర్తి భద్రత కల్పించేందుకు ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.మీ భూమి మీ హక్కు ద్వారా రైతులకు సంపూర్ణ భూ యాజమాన్య హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.గత ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రైతులకు పూర్తి హక్కులతో రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు అందించిన ఘనత టిడిపి ప్రభుత్వం దేనిని పేర్కొన్నారు ఈ సందర్భంగా ఆ గ్రామ రైతులు ఆనందోత్సాహాలతో హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వేల్పులకుంట సర్పంచ్ పత్తిపాటి వెంగయ్య జమ్మవరం టిడిపి నాయకులు పైడి శ్రీనివాసులు వీఆర్వోలు చంద్రమౌళి కే నరేష్ కృష్ణ ప్రసాద్ హరి బాబు మండల సర్వేయర్ షేక్ అజీజ్ గ్రామ రైతులు ప్రజలు పాల్గొన్నారు.

## అంబటి జోగీలు జగన్ మెప్పు కోసమే బండబూతులు.....

**టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్......**



**అమరావతి ఫిబ్రవరి 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి లోకేష్ లపై అంబటి రాంబాబు జోగి రమేష్ లు చేసిన అసభ్య వ్యాఖ్యలు జగన్ మెప్పు పొందాలని చూశారని, అంబటి జోగీలు హద్దు మీరి రోడ్డు మీదకు వచ్చి బండబూతులు తిట్టడాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ తీవ్రంగా ఖండించారు. అమరావతిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం కార్యకర్తలను రెచ్చగొట్టి శాంతి భద్రత సమస్యను సృష్టించాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో అల్లజడులు సృష్టించి ఏపీకి పెట్టుబడులు రాకుండా చూడాలని వైసీపీ కుట్రకు తెరతీసిందని ఆయన విమర్శించారు రాష్ట్రంలో అలజడలు సృష్టించేందుకే వైసీపీ నేతలంతా భూతల పురాణము ఎత్తుకున్నారని ఆయన విమర్శించారు. చంద్రబాబు లోకేష్ లపై అంబటి జోగిలుచేసిన అసభ్య వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారని ఆయన విమర్శించారు ఆంధ్రప్రదేశ్ లో కావాలని వైసిపి నేతలు అల్లర్లు సృష్టిస్తున్నారని జగన్ కన్ను సైకిల్ లోనే జోగి అంబటిలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆయన విమర్శించారు చంద్రబాబు ఎప్పటికీ మచ్చలేని చంద్రుడే అని ఆయన కొనియాడారు. జగన్ అధికార మదంతో కొరివితో తలగోక్కున్నారని ఆయన విమర్శించారు కల్తీ నెయ్యి కేసు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే అంబటి జోగులను జగన్ ఉసిగొలిపారని ఆయన విమర్శించారు



జవహర్ నగర్ వ్యవస్థాపకులు మాజీ సర్పంచ్ నరసింగరావు గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించిన మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, మరియు మాజీ కార్పొరేటర్లు కుతాడి సాయికుమార్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **జవహర్ నగర్, జనవరి 03:(వార్తా ప్రభ)**

